http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శనివారం 15 ఆగస్టు 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## వికసిత్ భారత్ కోసం దేశప్రజలంతా పనిచేయాలి

- సిందూర్ బలమైన సందేశం పంపింది
- సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో రైతులకు మేలు
- జ్యోతిబా పూలే, సావిత్రిబాయి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషిచేశారన్న రాష్ట్రపతి
- మహిళా సాధికారత కోసం పాటుపడ్డారని ద్రౌపదీ ముర్ము



## రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై రాష్ట్రపతికి ప్రధాని మోదీ ప్రశంసలు
- రాష్ట్రపతి ప్రసంగం దేశ సుస్థిరతను ప్రతిబింబిస్తోందన్న ప్రధాని
- గత పదేళ్లలో సాధించిన అభివృద్ధిని ప్రస్తావించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- మహిళలు, యువత, పేదల సంక్షేమ పథకాలపై ప్రత్యేక ప్రస్తావన
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు సమిష్టి కృషికి పిలుపు





## భారత్ సహనాన్ని బలహీనత అనుకోవద్దు

- డిస్కవరీ డాక్యుసిరీస్ 'డీక్లాసిఫైడ్
- ఆపరేషన్ సింధూర్'లో మాట్లాడిన ఎన్ఎస్ఏ
- ఆపరేషన్‌లో శత్రు శిబిరాలు, ఉగ్ర పుట్టలు ధ్వంసం చేసినట్లు ధోబాల్ వెల్లడి
- పహల్గాం దాడిపై తొలిసారి మాట్లాడిన అజిత్ డోభాల్
- దాడి వెనుక సూత్రధారి ఎవరని ప్రధాని మోదీ అడిగారని వెల్లడి
- ఆపరేషన్ సిందూర్ పేరిట 9 ఉగ్రశిబిరాలపై భారత్ దాడి
- నిందితులను వేగంగా గుర్తించిన నిఘా వర్గాలపై ప్రశంసలు

### ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో

# గ్లోబల్ సమ్మిట్

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు కేబినెట్ నిర్ణయం
- ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో
- సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 సదస్సు
- సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుకు నిర్ణయం



హైదరాబాద్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. రాష్ట్ర సచివాలయంలో మూడు గంటలపాటు జరిగిన ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది కంటే ఘనంగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. క్యూర్ పరిధిలోని ఆటోలను ఈవీలుగా మార్చేందుకు ప్రత్యేక పథకం అమలు చేయనున్నారు. సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీ రఘురామిరెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. గతంలో రాష్ట్రంలో 2.81కోట్ల మంది రేషన్‌కార్డు లబ్ధిదారులుండగా.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా 62 లక్షల రేషన్ కార్డులను జారీ - మిగతా3లో

## కొలంబియాకు అండగా భారత్

- బంగ్లాదేశ్ డీజిల్ అభ్యర్థన, సింధూ జలాల ఒప్పందంపైనా కీలక ప్రకటన
- భూకంప బాధిత కొలంబియాకు 20 మెట్రిక్ టన్నుల వైద్య, సహాయక సామగ్రి పంపిన భారత్
- బంగ్లాదేశ్ డీజిల్ అభ్యర్థనపైనా స్పందించిన భారత విదేశాంగ శాఖ
- బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పలు దేశాలకు ఆహ్వానాలు



## నాకు, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకోకండి

- నల్సార్ విద్యార్థుల అంశంలో బీసీఐపై సీజేఐ ఆగ్రహం
- బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం
- విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉంటుందన్న సీజేఐ సూర్యకాంత్
- వెనక్కి తగ్గిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా



### అత్యంత ప్రతిష్ఠాత్మకంగా

# గోదావరి పుష్కరాలు



- 'గోదావరి పుష్కరాలు-2027' నిర్వహణపై మంత్రి దుద్దిళ్ల సమీక్ష
- ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి
- టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలి
- గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. వెయ్యి కోట్లు కేటాయించింది

హైదరాబాద్

గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ సెప్టెంబర్ మొదటి వారంలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆ మేరకు టెండర్ ప్రక్రియను ఆగస్టు చివరి నాటికి పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు. డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షతన 'గోదావరి పుష్కరాలు - 2027' కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ (సీతక్క), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తదితరులు - మిగతా3లో



## 'రెడ్ లైన్' దాటితే వరల్డ్ మ్యాప్‌లోనే ఉండరు

- పాకిస్థాన్‌కు భారత నేతల తీవ్ర హెచ్చరిక
- సింధు జలాల ఒప్పందంపై హెచ్చరించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్
- ఇది తమ దేశానికి 'రెడ్ లైన్' అని వ్యాఖ్య
- తీవ్రంగా స్పందించిన భారత రాజకీయ పక్షాలు
- దుస్సాహసాలకు పాల్పడితే భూమండలంపైనే లేకుండా పోతారని ఘాటు హెచ్చరిక
- ఉగ్రవాదం ఆపేవరకు ఒప్పందం పునరుద్ధరణ అసాధ్యమని భారత్ స్పష్టం

# చదువే ఆయుధం

- "మహనీయుల విగ్రహాలు చూసి వారి త్యాగాలు, స్ఫూర్తి పొందాలి
- యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చాం
- హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో జ్యోతిబా ఫులే, సావిత్రీబాయి ఫులే దంపతుల విగ్రహావిష్కరణ
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- విద్యావ్యవస్థను సమూల ప్రక్షాళన చేశామన్న సీఎం
- అన్నివర్గాలు ఒకేచోట చదువు, జీవించడం వల్ల కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందని
- చదువుతో తలరాత మారి సమాజంలో గుర్తింపు లభిస్తుందని



హైదరాబాద్

ప్రజాపాలనలో మహాత్మా జ్యోతిబా ఫులే విధానాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అన్నివర్గాలు ఒకేచోట చదువు, జీవించడం వల్ల కులవ్యవస్థ నిర్మూలన సాధ్యమవుతుందని చెప్పారు. చదువుతో తలరాత మారి సమాజంలో గుర్తింపు లభిస్తుందని వివరించారు. హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో బీసీ సంక్షేమశాఖ ఏర్పాటు చేసిన జ్యోతిబా ఫులే, సావిత్రీబాయి ఫులే దంపతుల విగ్రహాలను రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్యను అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా పాఠశాలల ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. ఏటా రూ.2,400 కోట్ల ఫీజు రీయింబర్స్?మెంట్ నిధులను ముందే క్రెడిట్ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది నుంచే దీన్ని అమలు చేస్తున్నామన్న ఆయన, కళాశాలల్లో అడ్మిషన్లు పొందాక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే నెల రోజుల్లోనే ఫీజు జమ అవుతుందని తెలిపారు. సాంకేతిక నైపుణ్యం ఉన్నవారికే ప్రపంచం రెడ్‌కార్పెట్‌తో స్వాగతం పలుకుతోందన్న - మిగతా3లో

# వికసిత్ భారత్ కోసం దేశప్రజలంతా పనిచేయాలి

ఉగ్రవాదులు, వారికి సహాయం చేసేవారు ఎక్కడ దాక్కున్నా సరే, వారి చర్యల ఫలితాలను అనుభవించక తప్పదనే బలమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ వారికి? పంపిందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడమనేది దేశ ప్రయోజనాలకు, ముఖ్యంగా రైతుల ప్రయోజనాలకు ఒక నిర్ణయాత్మకమైన చర్య అని పేర్కొన్నారు. సత్యం, న్యాయాన్ని కాపాడటంలో భారత్ ఎప్పుడూ ముందుంటుందని ముర్ము స్పష్టం చేశారు. ఈ మేరకు 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతిని శుక్రవారం రాత్రి ప్రసంగించారు.

పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి ముర్ము ప్రస్తావించారు. ఆ సమయంలో భారత సాయుధ దళాలు కచ్చితత్వంతో వ్యవహరించగల సామర్థ్యాన్ని ప్రదర్శించిందని ఆమె కొనియాడారు. ఉగ్రవాదులకు, వారికి మద్దతు ఇచ్చేవారికి ఇది ఒక స్పష్టమైన, గట్టి సందేశమని అన్నారు. ఉగ్రవాదానికి ఆశ్రయమిచ్చే దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం దేశ ప్రయోజనాల దృష్ట్యా, ముఖ్యంగా మన రైతులకు ఎంతో మేలు చేస్తుందని రాష్ట్రపతి చెప్పారు. పాక్?, సరిహద్దు ఉగ్రవాదానికి పూర్తిగా స్వస్తి చెప్పేంతవరకు ఈ ఒప్పందం నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపిందన్నారు. తన 16 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ భూమిలో 80 శాతానికి, మొత్తం నీటి వినియోగంలో 93 శాతానికి సింధు నదీపైనే ఎక్కువగా ఆధారపడిన పాకిస్థాన్‌కు ఈ నిర్ణయం గట్టి దెబ్బ అని చెప్పవచ్చు.

**'వికసిత్ భారత్ కోసం దేశప్రజలంతా పనిచేయాలి'**



వికసిత్ భారత్ లక్ష్యసాధన కోసం దేశప్రజలంతా పనిచేయాలని ముర్ము పిలుపునిచ్చారు. ఆమె సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. దేశంలో ఇప్పటికే 3 కోట్ల మంది మహిళలను లక్షాధికారులను చేసినట్లు పేర్కొన్న రాష్ట్రపతి కొత్తగా మరో 3కోట్ల మందిని లక్షాధికారులను చేయాలనే లక్ష్యం దిశగా పయనిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక డిజిటల్ లావాదేవీలు భారత్‌లోనే జరుగుతున్నాయని రాష్ట్రపతి గుర్తు చేశారు. దేశాన్ని నక్సల్ రహితంగా మార్చడం గొప్ప విజయంగా అభివర్ణించారు. పబ్లిక్ పరీక్షల్లో అవకతవకల నివారణకు పెద్దఎత్తున సంస్కరణలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. మన విద్యార్థులే మన దేశ భవిష్యత్ నిర్మాతలని పేర్కొన్నారు. "మనం మన కలలను సాకారం చేసుకునే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. భారత్‌ను అత్యుత్తమ దేశంగా తీర్చిదిద్దాలనే స్ఫూర్తితో పనిచేయాలి. అప్పుడే దేశ స్వాతంత్ర్యానికి నిజమైన సార్థకత చేకూరుతుంది. నిబద్ధత గల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అభివృద్ధికి బాటలువేసే శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, వైద్యసేవల్లో ఉన్న డాక్టర్లు, ఆరోగ్య కార్యకర్తలు, శ్రమించే కార్మికులు, రైతులు అలుపెరగని కృషితో జాతి నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. క్రీడాకారులు, శిల్పులు, కళాకారులు, మార్గనిర్దేశంచేసే మేధావులు, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు, ప్రజా సంక్షేమం కోసం అంకితమైన ప్రజాప్రతినిధులు, న్యాయవ్యవస్థకు సంబంధించిన సిబ్బంది, అంకితభావంతో పనిచేసే సివిల్ సర్వెంట్లు, ఆర్థికవ్యవస్థకు తోడ్పడే చిన్నాపెద్దా పెట్టుబడిదారులు, సామాజిక సేవకులు, స్వచ్ఛతా అభియాన్‌లో ముందుండే కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు దేశప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్నారు" అని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. అలాగే, దేశంలో నక్సల్ ప్రభావం తగ్గడంపై ముర్ము ప్రస్తావించారు. "భారతదేశాన్ని నక్సల్ రహిత దేశంగా మార్చడం ఒక గొప్ప విజయం. ఒకప్పుడు నక్సలిజం బారిన పడిన ప్రాంతాల్లో నేడు ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ఈ ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి జరుగుతోంది" అని ఆమె తెలిపారు. "జన్‌ధన్ ద్వారా దేశవ్యాప్తంగా 59 కోట్ల మందికి బ్యాంకు ఖాతాలు అందించాం. 80 కోట్ల మందికి రేషన్ సరకులు అందజేస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ ద్వారా 60 కోట్ల మందికి వైద్యసేవలు అందుతున్నాయి. కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా వ్యవసాయం, అనుబంధ రంగాలు బలోపేతమయ్యాయి. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగాలి" అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

# కొలంబియాకు అండగా భారత్

విదేశాంగ మంత్రిత్వ శాఖ నిర్వహించిన తాజా మీడియా సమావేశంలో భారత్‌కు సంబంధించిన పలు కీలక అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై స్పష్టత ఇచ్చింది. కొలంబియాలో ఇటీవల సంభవించిన భారీ భూకంపం నేపథ్యంలో భారత్ 20 మెట్రిక్ టన్నుల సహాయక సామగ్రిని పంపినట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. బంగ్లాదేశ్ అదనపు డీజిల్ కావాలని చేసిన అభ్యర్థనపైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. ఇండస్ వాటర్ ట్రీటీపై (సింధూ జలాల ఒప్పందం) భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని మరోసారి స్పష్టం చేశారు. ఇంకా ఏయే అంశాలపై మాట్లాడారో పూర్తి వివరాల్ని చూద్దాం.

కొద్ది రోజుల కిందట కొలంబియాలో సంభవించిన భూకంపంపై భారత్ తీవ్ర సానుభూతి వ్యక్తం చేసింది. భూకంపంలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సంతాపం తెలిపారు. సహాయక చర్యల్లో భాగంగా వైద్య సామగ్రి, మెడికల్ పరికరాలు సహా మొత్తం 20 మెట్రిక్ టన్నుల మేర సహాయక సామగ్రిని ఆ దేశానికి పంపినట్లు వెల్లడించారు. ఇతర ఏ సహాయమైనా అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని జైస్వాల్ స్పష్టం చేశారు. బంగ్లాదేశ్‌లో ఇంధన సంక్షోభం నేపథ్యంలో అదనంగా డీజిల్ కావాలని ఆ దేశం చేసిన విజ్ఞప్తిపై ఎంఈఏ స్పందించింది. భారత్, బంగ్లాదేశ్ మధ్య ఇప్పటికే డీజిల్ సరఫరా కొనసాగుతోందని తెలిపిన జైస్వాల్, అదనంగా కావాలని చేసిన అభ్యర్థనను భారత్ పరిశీలిస్తుందని స్పష్టం చేశారు. ముందుగా దేశీయ అవసరాలు, రిఫైనింగ్ సామర్థ్యం, దేశంలో అందుబాటులో ఉన్న డీజిల్ పరిమాణం వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకొని తర్వాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎంఈఏ భారత వైఖరిని వెల్లడించింది.

**ఇండస్ వాటర్ ట్రీటీపై అదే మాట**



సింధూ జలాల ఒప్పందం విషయంలో భారత్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని కేంద్ర విదేశాంగ శాఖ మరోసారి ఉద్ఘాటించింది. ఇప్పటికే ఈ ఒప్పందంపై భారత ధోరణి గురించి పలుమార్లు వెల్లడించిందని, దీంట్లో ఎలాంటి మార్పు లేదని పేర్కొంది. పాకిస్థాన్ సరిహద్దు బయట ఉగ్రవాదాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించే వరకు దీని ఊసు ఎత్తొద్దని గతంలోనే భారత్ తేల్చిచెప్పింది.

**వైట్‌హౌస్ రిపోర్టుపై ఏం చెప్పిందంటే?**

అమెరికా వైట్‌హౌస్ విడుదల చేసిన 'ది గ్రేట్ ట్రాన్స్‌షిప్‌మెంట్ స్కామ్' రిపోర్ట్‌పై భారత్ స్పందించింది. సుంకాల ఎగవేతకు సంబంధించిన నివేదికలో చేసిన ఆరోపణలు, అందులో అనుసరించిన విధానాన్ని భారత్ నిశితంగా పరిశీలిస్తుందని విదేశాంగ శాఖ బదులిచ్చింది. ఏదైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే భారత చట్టాలకు అనుగుణంగా నడుచుకుంటామన్నారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టానికి సంబంధించిన ప్రశ్నపై కూడా విదేశాంగ శాఖ బదులిచ్చింది. భారత్‌కు సంబంధించిన శాసనపరమైన అంశాలు దేశ అంతర్గత వ్యవహారాలని, వాటిపై నిర్ణయం తీసుకునే అధికారం భారత పార్లమెంటుకు ఉందని జైస్వాల్ తెలిపారు. ఈ అంశంపై తప్పుదారి పట్టించే రిపోర్ట్స్‌ను పట్టించుకోవద్దని సూచించారు. బంగ్లాదేశ్ ప్రధానికి భారత్ ద్వైపాక్షిక పర్యటన కోసం ఆహ్వానం పంపినట్లు జైస్వాల్ తెలిపారు. బ్రిక్స్ సమిట్ అవుట్‌రీచ్ సెషన్‌కు హాజరయ్యేందుకు కూడా బంగ్లాదేశ్ ప్రధానిని భారత్ ఆహ్వానించింది.

**అఫ్గానిస్థాన్, రష్యా, సింగపూర్, నేపాల్‌తో సంబంధాలపై**

ఇక అఫ్గానిస్థాన్‌తో కొన్ని నెలలుగా కీలక సంప్రదింపులు, పర్యటనలు కొనసాగుతున్నాయని ఎంఈఏ తెలిపింది. ఇరు దేశాల మధ్య అభివృద్ధి సహకారం, వాణిజ్యం, కనెక్టివిటీ తదితర రంగాల్లో భాగస్వామ్యం మరింత బలపడిందని జైస్వాల్ చెప్పారు. ప్రస్తుతం ఆ దేశంతో భారత్‌కు మంచి సంబంధాలే ఉన్నాయని, భవిష్యత్తులోనూ అదే కొనసాగించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చేసిన నార్తర్న్ సీ రూట్ వ్యాఖ్యలపై కూడా జైస్వాల్ స్పందించారు. దీనిపై రష్యాతో చర్చలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు. రష్యాతో భారత్‌కు పలు రంగాల్లో సహకారం ఉందని, ఇతర సంబంధిత అంశాల్లో కూడా చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. నేపాల్‌తో భారత సంబంధాలపైనా ఎంఈఏ కీలక వ్యాఖ్యలు చేసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు చాలా బలమైనవి, చారిత్రక నేపథ్యం ఉన్నవని, ప్రజల మధ్య కూడా మంచి అనుబంధం ఉందని వివరించింది. ఏమైనా సమస్యలు ఉంటే కూర్చొని చర్చించుకోవాల్సిన అవసరం ఉంటుందని జైస్వాల్ స్పష్టం చేశారు. ఇక సింగపూర్‌తో మరింత సమన్వయం కోసం రెండు దేశాల నుంచి పలువురు మంత్రుల సమక్షంలో చర్చలు జరగాల్సి ఉందన్నారు. చివరగా జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో హరియాణాకు చెందిన భారత సంతతి వ్యక్తి కత్తిపోట్లకు గురై మరణించిన ఘటనపై కూడా విదేశాంగ శాఖ స్పందించింది. ఈ ఘటనపై రణధీర్ జైస్వాల్ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనల్లో విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు, కాన్సులేట్లు భారత పౌరుల సంక్షేమం, వారి కుటుంబల యోగక్షేమాల కోసం పనిచేస్తాయని జైస్వాల్ తెలిపారు.

# భారత్ సహనాన్ని బలహీనత అనుకోవద్దు

భారత్ ఎల్లప్పుడూ శాంతిని కోరుకుంటుందని, కానీ దాన్ని ఎవరైనా చేతగానితనంగా భావిస్తే సహించేది లేదని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ఢోబాల్ స్పష్టం చేశారు. అవసరమైతే శత్రువుల స్థావరాల్లోకి దూసుకెళ్లి మరీ దెబ్బకొట్టే సత్తా భారత్‌కు ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం "డీక్లాసిఫైడ్: ఆపరేషన్ సిందూర్" అనే డాక్యుమెంటరీ సిరీస్ కోసం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఢోబాల్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి కారణమైన వారిని, ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా నాశనం చేయడమే ఆపరేషన్ సిందూర్ లక్ష్యమని ఢోబాల్ పేర్కొన్నారు. దాదాపు 88 గంటల పాటు సాగిన పోరాటంలో భారత సైనికులు శత్రు మూకలను మట్టికరిపిం చిందని తెలిపారు. అయితే, ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన చారిత్రాత్మక సైనిక వ్యూహాలు, నిర్ణయాల వెనుక ఉన్న అసలు కథను ఈ డాక్యుమెంటరీ సిరీస్ ద్వారా తెలియజేయనున్నారు. ఆగస్టు 15న(శనివారం) రాత్రి 9 గంటలకు డిస్కవరీ ఛానెల్, డిస్కవరీ ప్లెస్‌లో ప్రసారం కానుంది. కాగా, ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఘోర ఉగ్రదాడికి భారత్ గట్టి బదులిచ్చింది. గతేడాది మే 7వ తేదీ తెల్లవారుజామున పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే) లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేసింది. ఇరు దేశాల మధ్య దాదాపు 88 గంటల పాటు కొనసాగిన ఈ సైనిక ఉద్రిక్తత, మే 10 సాయంత్రం ఒక అవగాహనకు రావడంతో ముగిసింది.



**పాకిస్థాన్‌కు గట్టి కౌంటర్ ఇచ్చిన భారత్**

ఇదిలా ఉండగా, సింధు జలాల ఒప్పందంపై పాకిస్థాన్? ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యాలను భారత్ తిప్పికొట్టింది. సింధు జలాలపై ఆందోళన వ్యక్తం చేసే ముందు, ఉగ్రదాడుల్లో చిందించిన ప్రతి భారతీయుడి రక్తపు బొట్టుకు ఇస్లామాబాద్? సమాధానం చెప్పాలని కేంద్ర మాజీ మంత్రి ఎం.జె. అక్బర్? వ్యాఖ్యానించారు. రక్తం, నీరు కలిసి ప్రవహించవని పాక్?కు గట్టి కౌంటర్? ఇచ్చారు. పాకిస్థాన్‌కు దక్కాల్సిన ప్రతి నీటి బొట్టూ తమకు రెడ్ లైనే అని షరీఫ్ గురువారం అన్నారు. తాము శాంతిని కోరుకుంటున్నామని, అయితే తమ సార్వభౌమాధికారానికి ముప్పు వాటిల్లితే మాత్రం చూస్తూ ఊరుకోమని వ్యాఖ్యానించారు. 2025లో భారత్‌తో జరిగిన ఘర్షణలో పాకిస్థాన్ పైచేయి సాధించిందని, భవిష్యత్తులోనూ ఏవైనా దాడులకు దిగితే అంతకంటే గట్టిగా బుద్ధి చెబుతామని షరీఫ్ అన్నారు.

సొంత దేశంపైనే బాంబులు వేసుకునే ఏకైక దేశం పాకిస్థాన్ ఇదిలా ఉండగా, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో చెలరేగిన హింస గురించి అక్బర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ సొంత దేశంపైనే బాంబులు వేసుకునే ఏకైక దేశం పాకిస్థాన్ అని ఆరోపించారు. గడిచిన 24 గంటల్లోనే పాక్? తనపైనే(బలూచిస్థాన్)లో బాంబుల వర్షం కురిపించిందని దుయ్యబట్టారు. పాక్ దయనీత స్థితిలో ఉందని, అంతర్గత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని అన్నారు. బలూచిస్థాన్ లోని 80 శాతానికి పైగా ప్రాంతంపై ఇస్లామాబాద్‌కు నియంత్రణ లేదని ఆరోపించారు. ఆ ప్రాంతంలో పాక్ సైన్యం జరిపిన దాడుల్లో చిన్న పిల్లలతో సహా 20 మందికి పైగా పౌరులు మరణించారని బలూచ్ మానవ హక్కుల కార్యకర్త జారా తెలిపిన వివరాలను అక్బర్ వెల్లడించారు.

ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఒకవైపు ఖైబర్ పఖ్తుంక్వా, బలూచిస్థాన్, పీఓకేలో తీవ్ర అశాంతి పరిస్థితులు, మరోవైపు మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలులో ఉండటం వంటి తీవ్ర రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు నడుస్తున్నాయని అక్బర్ అన్నారు. అయితే, వీటన్నింటిని కప్పిపుచ్చుకోవడానికే షెహబాజ్ షరీఫ్ భారత్‌పై నీటి వివాదాన్ని తెరపైకి తెచ్చారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

## రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం



80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు. శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ @ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

## 'రెడ్ లైన్' దాటితే వరల్డ్ మ్యాప్‌లోనే ఉండరు..



సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ చేసిన బెదిరింపు వ్యాఖ్యలపై భారత రాజకీయ నేతలు తీవ్రంగా స్పందించారు. ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా పాకిస్థాన్‌ను ప్రపంచ పటం నుంచే తుడిచిపెడతామని పార్టీలకతీతంగా నేతలు ముక్తకంఠంతో హెచ్చరించారు. సింధు జలాల అంశం తమ దేశానికి "రెడ్ లైన్" అని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలకు భారత నేతలు గట్టిగా బదులిచ్చారు. పాకిస్థాన్ తన గడ్డపై నుంచి ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టేంత వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ ఎప్పటినుంచో స్పష్టం చేస్తోంది. ఈ విషయంపై ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, "భారత్ తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే పనిచేస్తుంది. అసలు పాకిస్థాన్ స్థాయి ఎంత? ప్రపంచంలో ఏ శక్తి ఉన్నా సరే.. మేము మా ప్రయోజనాల కోసమే పనిచేస్తాం, వాటిని దృఢంగా కాపాడుకుంటాం" అని తేల్చిచెప్పారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్.పి. సింగ్ పాకిస్థాన్‌ను విమర్శిస్తూ, "గతేడాది జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ పరిస్థితి ఏమైందో షెహబాజ్ షరీఫ్ మరిచిపోయి ఉండొచ్చు. వారి ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు ఎలా ధ్వంసమయ్యాయో గుర్తు చేసుకోవాలి. ఇప్పుడు ఎలాంటి దుస్సాహసానికి ప్రయత్నించినా, పాకిస్థాన్ ప్రపంచ పటం నుంచే శాశ్వతంగా కనుమరుగవుతుంది" అని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "భారత్ ఈ ఒప్పందాన్ని నిలిపివేయడానికి బలమైన కారణం ఉంది. పాకిస్థాన్ వైపు నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇటీవల కశ్మీర్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొన్న దాడుల నేపథ్యంలో, పాకిస్థాన్‌తో సంబంధాలు కొనసాగించడం భారత్‌కు చాలా కష్టం" అని ఆయన వివరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ, "'ఆపరేషన్ సిందూర్'లో మన భారత సైన్యం వారికి ఎరుపు, పసుపు, నీలం.. అన్ని రకాల లైన్లను ఎలా చూపించిందో మీరు చూసే ఉంటారు. కాబట్టి, పాకిస్థాన్ చెప్పేది భారత్ సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. వారు చేసే ప్రతి పనికి వెయ్యి రెట్ల బలంతో గట్టి సమాధానం చెప్పే సామర్థ్యం భారత్‌కు ఉంది. ఈ విషయంలో యావత్ దేశం భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి అండగా నిలుస్తుంది" అని ఐఏఎన్ఎస్‌కు తెలిపారు. ఇటీవల, అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా మాట్లాడుతూ, 1960లో సద్భావన, స్నేహ స్ఫూర్తితో ఈ ఒప్పందం కుదిరిందని, కానీ గత 50 ఏళ్లుగా పాకిస్థాన్ ఈ స్ఫూర్తిని నాశనం చేసిందని పేర్కొన్నారు. ఒప్పందాన్ని నిలిపివేయడం అనేది పాకిస్థాన్ ప్రవర్తన వల్ల ఇప్పటికే నాశనమైన వాస్తవాన్ని అంగీకరించడమేనని ఆయన వ్యాఖ్యానించారు.

## దేశ యువతను తప్పుదోవ పట్టించేందుకు నా మాటలను వక్రీకరిస్తున్నారు

కోర్టు విచారణల సందర్భంగా చేసిన మౌఖిక వ్యాఖ్యలను సరైన సందర్భం లేకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. తన వ్యాఖ్యలను తప్పుగా ఉటంకించి, దురుద్దేశంతో దేశ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. 2026 మే 15న సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణ సందర్భంగా జస్టిస్? సూర్యకాంత్ యువతపై కీలక వ్యాఖ్యలు చేశారు. అవి తీవ్ర చర్చకు దారితీశాయి. ముఖ్యంగా యువత నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. అనంతరం వ్యంగ్యంగా 'కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)' అనే పేరుతో ఆన్‌లైన్ ఉద్యమం ప్రారంభించారు."ఈ రోజుల్లో సరైన సందర్భం లేకుండానే కోర్టు విచారణల క్లిప్పులు సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్నాయి. నా వ్యాఖ్యలను తప్పుగా వక్రీకరించి, నేను చెప్పని విషయాన్ని చెప్పినట్లుగా చిత్రీకరించారు. ఇది అత్యంత దురదృష్టకరం. ముఖ్యంగా, ఇది దేశ యువతను తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న దురుద్దేశపూరిత ప్రయత్నం."

**'మీడియా బాధ్యతాయుతంగా వార్తలు అందించాలి'**

అయితే, న్యాయపరమైన కార్యకలాపాలపై బాధ్యతాయుతంగా వార్తలు అందించాలని మీడియాకు సూచించారు. సమాజంలో సామరస్యాన్ని కాపాడటం ప్రతి పౌరుడి విధి అని అన్నారు. "మీరు సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, మరే ఇతర మీడియాలో ఉన్నా లేదా కేవలం ఒక సాధారణ పౌరుడైనా, మనందరికీ హక్కులు, రాజ్యాంగబద్ధమైన విధులు, బాధ్యతలు ఉన్నాయి. మనం హక్కుల గురించి మాట్లాడినప్పుడు, వాటికి అనుగుణంగా బాధ్యతలను నిర్వర్తించే సామర్థ్యం కూడా మనకు ఉండాలి.

# నాకు, విద్యార్థులకు మధ్య జోక్యం చేసుకోకండి

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశాలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నల్సార్ లా వర్సిటీ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేస్తూ బీసీఐ గురువారం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తాజాగా ఆయన స్పందించారు. విద్యార్థులకు నిరసన తెలిపే హక్కు ఉంటుందన్న సీజేఐ, తనకు, విద్యార్థులకు మధ్య బీసీఐ జోక్యం చేసుకోవద్దని కోరారు. తాను కూడా విద్యార్థి దశలో నిరసనల్లో చురుగ్గా పాల్గొన్నానని, శాంతియుతంగా గళాన్ని వినిపిస్తే అనుమతించాలని సూచించారు.

**విద్యార్థులకు లీగల్ ఎయిడ్ కోర్సుల్లో**

విద్యార్థులంతా ఎన్‌రోల్ చేసుకోవాలన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, విద్యార్థులకు లీగల్ ఎయిడ్ కోర్సుల్లో ప్యానెల్‌గా అవకాశం కల్పిస్తామని, అందుకు సుప్రీంకోర్టు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నల్సార్ యూనివర్సిటీ విద్యార్థుల అంశంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వెనక్కి తగ్గిన విషయం తెలిసిందే. నల్సార్ విద్యార్థులు ఎక్కడైనా న్యాయవాదులుగా నమోదు చేసుకోవచ్చుని బీసీఐ తెలిపిన సంగతి విధితమే.

**సోషల్ మీడియాలో తీవ్ర అభ్యంతరాలు**

నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను పిలవొద్దంటూ అక్కడి విద్యార్థులు పెద్ద ఎత్తున లేఖలు రాసినట్లు వార్తలొచ్చిన నేపథ్యంలో ఆ వ్యవహారంపై 3 రోజుల్లోగా పూర్తి నివేదికను సమర్పించాలంటూ బార్? కౌన్సిల్ ఛైర్మన్? మనన్ ?కుమార్ మిశ్రా తొలుత వర్సిటీ వైస్ ఛాన్స్?లర్?ను ఆదేశించారు. ఈ ఘటనకు బాధ్యులపై పూర్తి నిర్ధారణకు వచ్చేంత వరకూ 2026 బ్యాచ్ విద్యార్థులను అడ్వొకేట్?లుగా ఎట్టి పరిస్థితుల్లోనూ నమోదు చేసుకోవద్దని అందులో పేర్కొన్నారు. దీనిపై కాక్రోచ్ జనతా పార్టీ అధికార ప్రతినిధి సౌరవ్‌దాస్ తీవ్ర అభ్యంతరం తెలపడం, బీసీఐ సభ్యుడు, కేరళ న్యాయవాది మనోజ్ కుమార్ బహిరంగంగా వ్యతిరేకించడం,



సోషల్ మీడియాలో తీవ్ర నిరసన వ్యక్తం కావడంతో మనన్? కుమార్ మిశ్రా వెంటనే తన లేఖలోని కొన్ని అంశాలను సవరణ చేస్తున్నట్లు ప్రకటించారు.

**తప్పు చేయని వారికి ఇబ్బంది ఎందుకు?**

లనల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్స్?లర్, అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల కార్యదర్శులకు బీసీఐ ఛైర్మన్ రాసిన లేఖపై బార్ కౌన్సిల్‌లో క్షుణ్ణంగా చర్చించామని, తాజా నివేదిక ప్రకారం నల్సార్ విశ్వవిద్యాలయానికి చెందిన అత్యధిక మంది విద్యార్థులకు ఈ విషయం తెలియదని, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్?ను అగౌరవపరిచే కార్యక్రమంలో భాగస్వాములు కావడానికి వారు విముఖత చూపినట్లు కౌన్సిల్ సభ్యులంతా అభిప్రాయపడ్డారని సవరణ ఉత్తర్వుల్లో తెలిపారు. అందువల్ల నల్సార్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేసే కార్యక్రమాన్ని ఆపేయాలంటూ ఛైర్మన్ జారీ చేసిన ఉత్తర్వులను సవరించాలని బీసీఐ నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులంతా తమకు నచ్చిన రాష్ట్రాల బార్ కౌన్సిళ్లలో పేర్లు నమోదు చేసుకోవచ్చన్న ఛైర్మన్ మనన్? కుమార్ మిశ్రా కొందరు అధ్యాపకులు, బయటి వ్యక్తులు అమాయక విద్యార్థులను రెచ్చగొట్టడంలో కీలక పాత్ర పోషించినట్లు విశ్వసనీయంగా తెలిసిందని అన్నారు. దీనిపై వర్సిటీ వీసీ సమర్పించే రిపోర్టు కోసం బార్ కౌన్సిల్ వేచి చూస్తోందని, ఆ నివేదిక అందిన తర్వాత తదుపరి కార్యాచరణ చేపడతామని తెలిపారు. తప్పు చేయని విద్యార్థులను ఇబ్బంది పెట్టకూడదనేదే తమ ప్రధాన ఉద్దేశమని సవరణ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు.

# పేదలకు ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై ఏమాత్రం ప్రేమ ఉన్నా ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మాజీమంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ 560 గజాల స్థలంలో అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి ఇచ్చారని గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో 109 ప్రాంతాలలో లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టి, వాటిలో 69 వేల ఇండ్లను అర్హులైన పేదలకు పారదర్శకంగా అందజేసినట్లు వివరించారు. కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలలో తాము ఇండ్లు నిర్మించామని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు ఎక్కడ నిర్మించిందని ముఖ్యమంత్రి ప్రశ్నిస్తున్నారని, తమ వెంట వస్తే తాము నిర్మించిన ఇండ్లను ప్రత్యక్షంగా చూపిస్తామని సవాల్ చేశారు. కొల్లూరు ప్రాంతంలో ఒకేచోట 16 వేల ఇండ్లను నిర్మించామని, ఇది ఆసియా ఖండంలోనే అత్యధిక గృహ సముదాయం ఉన్న ప్రాంతం అని తెలిపారు. విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, లిఫ్ట్,




తాగునీరు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఉచితంగా ఇండ్లు నిర్మించినా ఎక్కడా తమ పేర్లు పెట్టుకోలేదని, కానీ లబ్ధిదారుల వద్ద రూ. 6 లక్షలు వసూలు చేస్తూ 'ఇందిరమ్మ ఇండ్లు' అని పేరు పెట్టుకోవడం ఏమిటని విమర్శించారు. ఎన్ని గజాల స్థలంలో ఇండ్లు నిర్మిస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇండ్ల కోసం దరఖాస్తుతో పాటు రూ. 10 వేలు చెల్లించాలని చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలు చెల్లించిన డబ్బులు ఇప్పటికీ రాలేదన్నారు. 22-ఏ జాబితాలోకి భూములు చేర్చి, పేదల భూములపై ఆంక్షలు పెట్టి, ఇప్పుడు మీ భూమి మీకే ఇప్పిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తలసాని మండిపడ్డారు. దీనిని అడ్డం పెట్టుకుని 30 నుండి 40 శాతం పర్సంటేజీల దందా ఎవరు చేస్తున్నారో అందరికీ తెలుసని, త్వరలోనే వారి వివరాలు బయటకు వస్తాయని హెచ్చరించారు.

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలి, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాము దేవుళ్లను ప్రార్థిస్తే, క్షుద్ర పూజలు చేశారంటూ ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మాట్లాడటం బాధాకరమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటానికి ఒక వేదిక కావాలనే ఉద్దేశంతోనే తెలంగాణ భవన్‌ను నిర్మించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ నిర్మాణం జరిగి 20 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ తెలంగాణ భవన్ ఒక 'జనతా గ్యారేజీ'లా మారిందని తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

# మహబూబ్‌నగర్‌లో బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్

**మహబూబ్ నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి పరిధిలో 416.18 ఎకరాల భూమిని గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చల తర్వాత ఈ ప్రాజెక్టుపై ముందడుగు పడింది. ఈ యూనిట్ ద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ఈ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూమిని అధికారులు గుర్తించి, క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల సర్వే విజయవంతంగా పూర్తికాగా.. ప్రస్తుతం పట్టా భూముల పరిశీలన కొనసాగుతోంది. రాష్ట్రంలో రక్షణ రంగ తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు. గత ఏడాది జూలైలో డీఆర్‌డీవో అధికారులు మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. రవాణా సదుపాయాలు, రోడ్డు, రైలు మార్గాలు అనుకూలంగా ఉండటంతో పాలమూరు ప్రాంతం బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సరిగ్గా సరిపోతుందని భావించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమై ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించడంతో రాష్ట్ర యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి భూసేకరణ ప్రక్రియను ముమ్మరం చేసింది. దేవరకద్ర మండలంలోని జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి



గ్రామాల్లో 416.18 ఎకరాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. చౌదర్‌పల్లిలో సర్వే నంబర్లు 295, 296 సహా బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో పట్టా భూముల వివరాలను సేకరించారు. సర్వేకు ముందే గ్రామ పంచాయతీల ద్వారా రైతులకు సమాచారం అందించి వారి సమ్మతితోనే పరిశీలనలు జరుపుతున్నారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రైతులకు ఆమోదయోగ్యమైన నష్టపరిహారాన్ని నిర్ణయించనున్నారు. పాలమూరులో బ్రహ్మోస్ తయారీ కేంద్రం ఏర్పాటైతే ఈ ప్రాంత ఆర్థిక రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రధాన యూనిట్‌తో పాటు అనుబంధ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, నాణ్యతా ప్రమాదాల విభాగాల్లో సాంకేతిక నిపుణులతో పాటు అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల్లో స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

## ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో గ్లోబల్ సమ్మిట్..

-మొదటిపేజీ తరువాయి

చేసిందని తెలిపారు. దీంతో ఆ సంఖ్య 3.42 కోట్లకు చేరిందన్నారు.

ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌ను ఆవిష్కరించినట్లే.. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపిందన్నారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించన్నట్లు చెప్పారు. ప్రధానంగా రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు.

**మరికొన్ని కీలక నిర్ణయాలివీ..**

వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, వాటి సాగును పెంచేందుకు రైతులకు అవగాహన కల్పించాలని క్యాబినెట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్సులు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్సులకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వీలైనంత త్వరగా స్థల సేకరణ చేసి నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది.

కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్యూర్ పరిధిలో నగరంలో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలున్నాయి. వీటిని ఈవీ (విద్యుత్తు వాహనాలు)గా మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50లక్షల సబ్సిడీ అందించాలని క్యాబినెట్ నిర్ణయించింది.

హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-2 పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందనుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

## చదువే ఆయుధం

-మొదటిపేజీ తరువాయి

సీఎం, అలాంటి వారికి జర్మనీ, జపాన్, సౌత్ కొరియాలో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. కృత్రిమ మేధ వల్ల నిపుణుల ఉద్యోగాలు పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సంక్షోభాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలనే దానిపై అందరూ ఆలోచించాలన్నారు. అందుకే విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాన్ని నేర్పిస్తున్నామన్నారు. సాంకేతిక నైపుణ్యం సాధించిన వారికి జర్మనీ, జపాన్, సౌత్? కొరియా పంపిస్తామన్నారు. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధిస్తే ప్రభుత్వ ఉద్యోగం, నజరానాలు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. "మహనీయుల విగ్రహాలు చూసి వారి త్యాగాలు, స్ఫూర్తి పొందాలి. చదువే ఆయుధంగా మారుతుందని జ్యోతిబా పూలే గుర్తించారు. ప్రజా పాలనలో జ్యోతిబా పూలే విధానాలు కొనసాగిస్తున్నాం. చదువు ద్వారా తలరాత మారుతుంది, ఆత్మగౌరవం, సమాజంలో గుర్తింపు వస్తుంది. అన్ని వర్గాలు ఒకేచోట చదువు, జీవించడం ద్వారా కుల వ్యవస్థ నిర్మూలన సాధ్యం. యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చాం" -రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

**యువత చదువు, క్రీడల్లో రాణించాలి**

జనగణన చేసి బలహీన వర్గాల లెక్క తేల్చిన తొలిరాష్ట్రంగా నిలిచి కేంద్ర ప్రభుత్వానికి సవాల్ విసిరామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలో లెక్కలు తేల్చి ఫిబ్రవరి 4న సోషల్? జస్టిస్ డేగా జరుపుకొంటున్నామన్నారు. కొందరు కులగణన, జలగననలో భాగస్వామ్యం కాలేదని కోర్టుకెక్కారన్నారు. అసెంబ్లీలో వ్యతిరేకించినా చట్టపరంగా కమిషన్ వేసి లెక్కలు తేల్చామని రేవంత్ రెడ్డి చెప్పారు. బలహీనవర్గాల లెక్కలు తేల్చిన రాష్ట్రం మనదే తొలి, చివరిదన్నారు.

జనాభా లెక్కలు తేల్చాలంటే కులగణన చేయక తప్పని పరిస్థితి అన్న రేవంత్ రెడ్డి, ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన వంటివి ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నామన్నారు. నాణ్యమైన విద్య, పౌష్ఠికాహారం అందించే బాధ్యత తనది అని వివరించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్?కు బాటలు వేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని రేవంత్ రెడ్డి వివరించారు. చదువులు, క్రీడలు, పరిపాలనలో రాణించాలని యువతకు పిలుపునిచ్చారు. పారదర్శక ప్రభుత్వాన్ని నడిపేందుకు సహకరించాలని కోరారు.

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా గోదావరి పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి



పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శాఖలవారీగా సన్నద్ధత, ఏర్పాట్ల పురోగతిని సమీక్షించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గోదావరి పుష్కరాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. వెయ్యి కోట్లు కేటాయించిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే టైర్-1 ప్రాంతాల్లో పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని, అలాగే భద్రత మరియు సమన్వయం కోసం ముఖ్యమైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి కావాలని, అదే సమయంలో నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని స్పష్టం చేశారు. పనుల పురోగతిని పరిశీలించేందుకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని, పనుల పురోగతిని రోజువారీగా పర్యవేక్షించేందుకు వీలుగా దేవాదాయ శాఖ అధికారులు ఒక ప్రత్యేక డ్యాష్‌బోర్డ్‌ను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రతి రోడ్డును అనుసంధానించాలని, ఎక్కడైనా రోడ్ల కనెక్టివిటీ లోపిస్తే వెంటనే గుర్తించి లోకల్ ఫండ్స్ నుంచి పనులు చేపట్టాలని చెప్పారు. అన్ని శాఖలు సమష్టిగా పనిచేస్తేనే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పుష్కరాలను విజయవంతం చేయవచ్చని, శాఖల మధ్య సమన్వయ లోపం రాకుండా ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ఏర్పాట్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, పండితులతో పాటు సేవలందించేందుకు ముందుకొచ్చే స్వచ్ఛంద, ప్రైవేట్ సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. కేబినెట్ సబ్ కమిటీ సభ్యుల సలహాలను విధిగా పరిగణనలోకి తీసుకోవాలని, పుష్కర ఏర్పాట్లలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు.

# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల్లో కనిపించని జెన్ జీ

ఆధునిక రాజకీయాల్లో జెన్ జీ ఓటర్లు అత్యంత కీలకమైన శక్తిగా మారుతున్నారు. జెన్ జీ వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాలను గడగడలాడించిన దృశ్యాలను చూసి, తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలు కూడా ఈ తరాన్ని తమవైపు తిప్పుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే, గడిచిన కొద్దికాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే.. పార్టీలు ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జెన్ జీ కార్డు క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రభావం చూపలేకపోతోంది తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా జెన్ జీ ఆధారిత ప్రచారాన్ని తీవ్రంగా నడిపే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ చదువుల్ని క్రిమినల్ వేస్ట్ అని సంబోధించడంతో యువ ఇంజనీర్లందర్నీ అలా అన్నారని కేటీఆర్ క్యాంపెయిన్ చేశారు. క్రిమినల్ వేస్ట్ , అన్ ఫిట్ వంటి హ్యాష్‌ట్యాగ్‌లు, మీమ్ కల్చర్‌తో యంగ్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూశారు. అయితే, ఈ మీమ్స్ సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్‌గా మాత్రమే మిగిలిపోయాయి తప్ప, నిరుద్యోగ యువతను లేదా కాలేజీ విద్యార్థులను రోడ్లపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాస్ ప్రొటెస్ట్‌గా మార్చడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరోలా ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని పునర్నిర్మించే క్రమంలో యువతను ఆకట్టుకునేందుకు వినూత్నంగా ప్రయత్నించింది. అయితే, నిజమైన తటస్థ జెన్ జీ యువతను భాగస్వాములను చేయడం కంటే, ఇప్పటికే పార్టీలో ఉన్న తమ అనుబంధ విద్యార్థి విభాగం, ఐటీ సెల్ కార్యకర్తలకే జెన్ జీ అనే కొత్త ల్యాబెల్ వేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం కనిపించింది. డీఎస్సీ పోరాటాల్లో ఈ పద్ధతి ఎక్కువగాఉంది. కేవలం పార్టీ ప్రచార పత్రాలు పట్టుకుని ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్‌లలో హల్‌చల్ చేయడం వల్ల అది కేవలం ఆర్గనైజ్డ్ పార్టీ ప్రచారంగానే మిగిలిపోయింది తప్ప, ఏపీలోని సాధారణ యువతలో ఎలాంటి పొలిటికల్ అప్‌రైజింగ్‌ను తీసుకరాలేకపోయింది. తెలుగు యువతలో అత్యధిక శాతం మంది ఐటీ ఉద్యోగాలు, యూఎస్/యూకే ఉన్నత చదువులు, గ్రూప్స్. సివిల్స్ , ఇతర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలోనే నిమగ్నమై ఉన్నారు. డిజిటల్ స్పేస్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తపరిచినా, రోడ్లెక్కి నిరసన తెలిపితే నమోదయ్యే క్రిమినల్ కేసులు తమ భవిష్యత్తు, వీసా అవకాశాలను దెబ్బతీస్తాయనే హెచ్చరిక వారిని వెనక్కి లాగుతోంది. నేటి తరం రాజకీయ వ్యతిరేకతను లేదా మద్దతును రీల్స్, మీమ్స్, ఎక్స్ , స్పేసెస్, డోపమైన్ ఇచ్చే డిజిటల్ కంటెంట్ రూపంలోనే చూపిస్తోంది. వీధి పోరా టాల కంటే డిజిటల్ ట్రోలింగ్‌నే వారు సౌకర్యవంతమైన యాక్టివిజంగా భావిస్తు న్నారు. రాజకీయ పార్టీలు జెన్ జీ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంలో పొరబడుతున్నాయి. నాయకులు వేసే మీమ్స్ లేదా వాడే జార్గన్స్ చూసి తమను వారు ప్రతిబింబిస్తున్నారని యువత భావించడం లేదు. పార్టీలు ప్రదర్శించే ప్రచా కృత్రిమమైనది గా ఉండటంతో యువత సులభంగా గుర్తిస్తోంది. ఉపాధి అవకాశాలు, క్వాలిటీ ఎడ్యుకేషన్, గిగ్ ఎకానమీ కార్మికుల సమస్యలు, స్టార్టప్ ఈకోసిస్టమ్, ప్రాజెక్టుల పురోగతి వంటి నిజమైన ఎజెండా వదిలేసి.. కేవలం వ్యక్తిగత దూషణలు, రాజకీయ ట్రోలింగ్ చుట్టూ తిరిగే కంటెంట్‌ను జెన్ జీ లైట్ తీసుకుంటోంది. రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయనంత మాత్రాన తెలుగు జెన్ జీకి రాజకీయ స్పృహ లేదనుకోవడం పార్టీల పెద్ద పొరపాటే అవుతుంది. వారు నిశ్శబ్దంగా గమనించే సైలెంట్ ఓటర్లు . బూత్ లెవల్‌కి వచ్చి ఓటు వేసే సమయంలో సాంప్రదాయ కుల, ప్రాంతీయ సమీకరణల కంటే.. వ్యక్తిగత స్వాతంత్ర్యం, ఉద్యోగ కల్పన, పారదర్శక పాలన అందించే నాయకులకే ప్రాధాన్యత ఇస్తారు. ఏదైనా ఒక రాజకీయ పార్టీ తమ సొంత ప్రయోజనాల కోసం తమను పొలిటికల్ టూల్ గా వాడుకోవాలని చూస్తే తిరస్కరించడంలో ఈ తరం ముందే ఉంటుంది. నాయకులు కేవలం మీమ్స్‌కే పరిమితం కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసానిచ్చే విజన్‌ను చూపినప్పుడే ఈ తరం ఓటర్లు నిజమైన మద్దతుదారులవుతారు.

# వెలుగునీడల 'స్వాతంత్ర్యం'

స్వతంత్ర భారతం నేటితో ఎనభయ్యో వసంతంలోకి అడుగుపెడుతోంది. దేశం ఈ 21వ శతాబ్దిలో ఎటు పయనిస్తున్నదని తరచి చూసుకుని, చక్కదిద్దుకోవాల్సిన సందర్భం ఇది. 1947 ఆగస్టు 15 నాటికి ఈ దేశం 565 సంస్థానాలుగా ఉంది. వలస పాలకులు చెప్పి నట్టల్లా ఆడి, ఇక్కడి సంపదను సంస్థానాధీశులు దోచిపెట్టడంతో ఆసేతుహిమాచలం దారిద్ర్యం తాండవిస్తున్నది. తలసరి ఆదాయంలో ప్రపంచంలోనే అట్టడుగునున్నాం. ఆహార ధాన్యాల కొరత అంతా ఇంతా కాదు. వీటిని అధిగమించి పురోగమించటం ఎలా అన్న సంశయం అందరినీ పట్టిపీడిస్తున్నవేళ గోరు చుట్టుపై రోకటిపోటులా మతకల్లోలాలు వచ్చిపడ్డాయి. వేలాదిమంది నెత్తుటి తర్పణంతో ఈ గడ్డ తడిసి ముద్దయింది.



హిందూ--ముస్లిం ఐక్యత కోసం స్వాతంత్ర్యోద్యమ సారథి గాంధీజీ తన ప్రాణాలనే బలిపెట్టాల్సివచ్చింది. ఆ పరిస్థితుల్ని చూసినవారు ఈ దేశం సమైక్యంగా మనుగడ సాధించగలదా అన్న సందేహంలో పడిపోయారు. భిన్న భాషలు, మతాలు, సంప్ర దాయాలు, సంస్కృతిగల ఈ గడ్డ పురోగతి సాధించటం అసాధ్యమని సంశయపడ్డ వారున్నారు. కానీ భిన్నత్వంలో ఏకత్వాన్ని, వైవిధ్యతలో విశ్వాసాన్ని దర్శించగలిగిన సామాన్య జనమే ఈ దేశాన్ని నడిసంద్రంనుంచి తీరానికి చేర్చారు.

మరి ఇప్పుడో... బహుళ రంగాల్లో పురోగమించాం. ఆహార ధాన్యాల దిగుమతి స్థాయినుంచి ఎగుమతి చేసే స్థాయికెదిగాం. ప్రపంచంలో అతి వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో మన దేశం కూడా ఒకటి. అతిపెద్ద స్టార్టప్ నెట్‌వర్క్‌లో ప్రపంచంలో మనది మూడో స్థానం. జనగణన పూర్తికాకపోవటంతో తాజా పరిస్థితిపై సాధికారకమైన గణాంకాలు లేకున్నా అక్షరాస్యత 77.7--80 శాతం మధ్య ఉందంటు న్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం మహిళల్లో అక్షరాస్యత దాదాపు 9 శాతమైతే, ఇప్పుడది 70.3 శాతానికి చేరింది.

గతంతో పోలిస్తే మెరుగైన వైద్య సదుపాయాలు సామాన్యులకు అందుబాటులోకి రావటంతో సగటు ఆయుఃప్రమాణం 71.5 సంవత్సరాలకు చేరుకుంది. నవజాత శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. 1951 నాటికి వెయ్యి శిశువులకూ 146 మరణాలు నమోదుకాగా, ఇప్పుడది 17. ప్రపంచంలోనే అత్యధిక పోలియో కేసులున్న దేశంగా ముద్రపడిన భారత్ ఇప్పుడు ఆ వ్యాధిని పూర్తిగా తరమ గలిగింది. ఒకనాడు పేదరికం 60 శాతం ఉండగా, ఇప్పుడది 12 శాతం లోపు. కానీ గణాంకాలు వాటికవే వాస్తవ స్థితిని ప్రతిబింబించలేవు. చివరి వ్యక్తికి సైతం సంక్షేమం అందటమే నిజమైన అభివృద్ధికి కొలమానమని గాంధీజీ ఎప్పుడో చెప్పారు. ఆ విషయంలో సాధించాల్సిందెంతో ఉంది. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావటంవల్ల ధనిక--పేద తారతమ్యం పెరిగింది. పేరుకు డిగ్రీలున్నా మన యువతలో నైపుణ్యాల కొరతవల్ల వారికి సరైన ఉపాధి లభించటం లేదు. అసలు విద్యారంగమే పేద, ధనిక వ్యత్యాసాలతో నిండింది. ప్రామాణికమైన విద్య ఖరీదైంది కావటంతో అత్యధికులు దాన్ని అందుకోలేకపోతున్నారు. ప్రభుత్వాలు ప్రైవేటు మోజులోపడి విద్యావ్యాపారాన్ని ప్రోత్సహిస్తున్నాయి. దేశంలో మొదటిసారి నెలకొల్పిన కొఠారి కమిషన్(1964--66) మొదలుకొని 2020 నాటి జాతీయ విద్యావిధానం వరకూ విద్యకు జీడీపీలో 6 శాతం కేటాయించాలని సిఫార్సు చేస్తూనే ఉన్నాయి. కానీ

# 80 ఏళ్ల భారతవని... ఎన్నో మార్పులు... అయినా.. ఇంకా...

**న్యూఢిల్లీ :** భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో, ప్రజల ఆర్థిక అలవాట్లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ప్రాథమిక అవసరాలకే పరిమితమైన కుటుంబాలు, ఇవాళ ప్రీమియం ఉత్పత్తులు, విదేశీ ప్రయాణాలు, వినోదంపై ఖర్చు చేస్తున్నాయి. స్థిరత్వం కోసం బ్యాంకు డిపాజిట్లపై ఆధారపడే స్థాయి నుండి, సంపద సృష్టి కోసం ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టే స్థాయికి భారతీయ మధ్యతరగతి వర్గం అద్భుతంగా ఎదిగింది. భారత్ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందినప్పుడు, పేదరికం, నిరక్షరాస్యత, ఆహార అభద్రత ఎక్కువగా ఉండేవి. ఆ కాలంలో సగటు కుటుంబాల ఇంటి వినియోగం కేవలం నిత్యావసరాలకు మాత్రమే పరిమితమై ఉండేదని ఆర్థికవేత్తల అంచనాలు చెబుతున్నాయి. కానీ 79 ఏళ్ల ఈ చారిత్రక ప్రయాణంలో భారతీయ ఆర్థిక వ్యవస్థ ఎంతో వృద్ధి చెందింది. ఒకప్పుడు స్కూటర్ కొనాలని ఆశపడిన కుటుంబం, ఇప్పుడు ఆధునిక ఎలక్ట్రిక్ కార్ల కోసం చూస్తోంది. ఇప్పుడు ప్రజల ఆర్థిక ఆకాంక్షలు స్థిరత్వాన్ని పొందడం నుండి, పెట్టుబడుల ద్వారా చురుకుగా సంపదను సృష్టించడం వైపు గణనీయంగా మారాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.




### కొరత నుండి ఎంపిక వరకు...

ఒకప్పుడు సగటు భారతీయుడి ఆర్థిక ఆకాంక్షలు కేవలం కూడు, గుడ్డ, ఇల్లు సంపాదించడంపైనే కేంద్రీకృతమై ఉండేవి. ఇవాళ పెరుగుతున్న ఆదాయాలు, వేగవంతమైన పట్టణీకరణ, డిజిటల్ వేదికల కారణంగా కుటుంబాలకు అనేక రకాల ఆప్షన్లు అందుబాటులోకి వచ్చాయి. తాజా సర్వే గణాంకాల ప్రకారం, గ్రామీణ, పట్టణ కుటుంబాల ఖర్చుల మధ్య అంతరం కూడా వేగంగా తగ్గుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కేవలం కడుపు నిండా తినడానికి చేసే ఖర్చుల వాటా క్రమంగా తగ్గి, మిగిలిన డబ్బును రవాణా, వినోదం, గృహవసతి, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, ఎలక్ట్రానిక్స్ వస్తువుల కోసం ఉపయోగిస్తున్నారు.

### సామూహిక వినియోగం నుండి ప్రీమియం వరకు...

ఆటోమొబైల్ రంగంలో సైతం వినియోగదారుల ఆలోచనా విధానంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వినియోగదారులు కేవలం అత్యంత చౌకైన ఎంట్రీ-లెవల్ వాహనాల కోసం చూడకుండా, వాడిన కార్ల మార్కెట్‌లో కూడా ప్రీమియం వేరియంట్లు , మెరుగైన సౌకర్యాలున్న ఎస్‌యూవీలను కొనుగోలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్ల విషయంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. ఉదాహరణకు, రూ.30 వేలుపైబడిన ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల మార్కెట్ వాటా 2020లో 20% ఉండగా, 2025 నాటికి అది 26%కి గణనీయంగా పెరిగింది.

### పెరుగుతున్న ప్రయాణాలు, వినోద ఖర్చులు

ఒకప్పుడు కేవలం కొద్దిమందికి మాత్రమే పరిమితమై, విలాసంగా భావించిన అంతర్జాతీయ విదేశీ ప్రయాణాలు.. ఇప్పుడు మధ్యతరగతి ప్రజలకు సాధారణ ఖర్చుగా మారిపోయాయి. పర్యాటక శాఖ లెక్కల ప్రకారం 2025లో భారత పౌరులు రికార్డు స్థాయిలో 32.83 మిలియన్ల విదేశీ పర్యటనలు చేశారు. మరోవైపు సంగీత కచేరీలు, క్రీడా కార్యక్రమాలు, లైవ్-ఈవెంట్స్ కోసం కూడా ప్రజలు ఇప్పుడు చాలా ఎక్కువ డబ్బును వెచ్చిస్తున్నారు.

### పొదుపు నుండి పెట్టుబడుల వైపు...

దశాబ్దాలుగా సంప్రదాయ భారతీయ కుటుంబాలు బ్యాంకు డిపాజిట్లు, స్థిరాస్తులు , బంగారంపై మాత్రమే ఎక్కువగా ఆధారపడేవి. కానీ ఇప్పుడు గృహ ఆర్థిక ఆస్తులలో ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్ల వాటా భారీగా పెరుగుతోంది. నెలవారీ సిప్ కంట్రిబ్యూషన్‌లు ఈజ17లో రూ.4,000 కోట్ల కంటే తక్కువగా ఉండగా, ఈజ26 ఏప్రిల్-నవంబర్ నాటికి ఏకంగా రూ.28,000 కోట్లకు పైగా అద్భుతంగా వృద్ధి చెందాయి. పెట్టుబడిదారుల సంఖ్య కూడా 2020లో 3.1 కోట్లు ఉండగా, 2025 నాటికి 11 కోట్లకు పైగా విస్తరించింది. భవిష్యత్తులో భారతీయ వినియోగ కథ కేవలం ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి పెద్ద మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, టైర్-ఎవి , టైర్-ఎవిఎ నగరాలకు కూడా వేగంగా విస్తరించనుంది. భారతదేశ జనాభాలో 31% మంది ఉన్న మధ్యతరగతి వర్గం.. ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టిస్తూ, మారుతున్న ఆధునిక భారతదేశ ముఖచిత్రానికి ప్రతీకగా నిలుస్తోంది.

## సెలబ్రెటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

**న్యూఢిల్లీ :** కొన్ని సంస్థలు, కంపెనీలు ప్రచారం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఎందచుకుంటున్నాయి. ఇందులోని ఇన్ ఫ్లుయెన్సర్స్ సైతం ఆదాయం పెంచుకునేందుకు కొన్ని ప్రత్యేక ప్రొడక్ట్స్ ను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. చాలా మంది ఇలా వాటి గురించి తెలుసుకొని వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసేవారిని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీని గురించి పూర్తి వివరాల్లోకి వెళితె..కొందరు సెలబ్రిటీలు, ఇన్ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆహారపదార్థాల్లోని 'ఇమ్యూనిటీ' 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి వాటి గురించి నిజానిజాలను పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది. ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేస్తున్నప్పుడు దాని ప్యాకేజింగ్‌పై ఉన్న వివరాలు, పోషక విలువలు, తయారీదారు చేస్తున్న ఆరోగ్య క్లెయిమ్స్ వంటి అంశాలను ఇన్ఫ్లుయెన్సర్లు పరిశీలించాలి. కేవలం బ్రాండ్ చెప్పిందని లేదా డబ్బులు తీసుకుని నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు చెప్పకూడదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, వినియోగదారులను తప్పుదోవ పట్టించనివిగా ఉండాలి. ఒక ఆహార పదార్థం లేదా దానిలోని ఏదైనా పదార్థం ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని చెప్పే హెల్త్ క్లెయిమ్స్‌కు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలి. గతంలో కూడా ఫుడ్ ప్రొడక్టులపై తప్పుడు లేదా అతిశయోక్తి ఆరోగ్య క్లెయిమ్స్ అనుమతించబోమని స్పష్టం చేసింది. ఒక ఉత్పత్తిలో ప్రోటీన్, విటమిన్లు లేదా మరేదైనా పోషక పదార్థం ఉన్నంత మాత్రాన దాన్ని మొత్తం ఆరోగ్యకరమైన ఆహారంగా చిత్రీకరించడం సరైనది కాదు.

## కాసు సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీ మల్లు రవి ఎమ్మెల్యే కసిరెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం లింగారావుపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మరియు తలకొండపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి దశదినకర్మ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆమె చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసు శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, మాతృమూర్తి మృతి పట్ల సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో , కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దోకూరి ప్రభాకర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు , యాట నరసింహ, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో పాటు వివిధ మండలాల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మాజీ మండల అధ్యక్షుడు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల కేంద్రానికి చెందిన వాన రాసి రాములు ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ అండగా ఉంటానని భరోసా కల్పిస్తూ, మృతుని కుటుంబ సభ్యులకు మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్ వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్ బిఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కొమ్ము నాగయ్య, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మంగళగిరి సత్యం,బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు జంగిలి ప్రవీణ్,గోపాల్, బిట్టి సైదులు,వానరాశి రాములు, శివరాజ్, మహేష్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ వారి సౌజన్యంతో వాటర్ ట్యాంక్ క్లింగ్



**సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపిన సర్పంచ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తలకొండపల్లి మండలంలోనీ దేవుని పడకల్ గ్రామ పంచాయతీలోనీ జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో వాటర్ ట్యాంక్‌ను ప్రత్యేక పద్ధతిలో శుభ్రపరిచారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ అనిత మల్లేష్,ఉప సర్పంచ్ వెంకటేష్ ,మరియు వార్డు సభ్యులు మంజుల ,స్వామి గౌడ్,లక్ష్మయ్య,రాములు, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వర్ష కాలం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు.ప్రతి ఒక్కరూ గ్రామంలోని తాగునీటి నిల్వ ట్యాంకును ఆధునిక జర్మన్ టెక్నాలజీతో పూర్తిస్థాయిలో శుభ్రపరచడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో ఆయనకు మా సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ఐక్యత ఫౌండేషన్‌ను చైర్మన్ సుశీకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్తపల్లిలో ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గ ఎన్నిక

**అగ్నిధార న్యూస్ పెద్దపల్లి రూరల్ :**

పెద్దపల్లి మండలం లోని కొత్తపల్లి గ్రామంలో మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు పెద్దపల్లి మండల ఎమ్మార్పీఎస్ ఇన్చార్జ్ పల్లె బాపు, పేర్క శివ. ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో ఎమ్మార్పీఎస్ కొత్తపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు గా పల్లె అజయ్, ను ఉపాధ్యక్షులుగా పంగ రాకేష్ , ప్రధాన కార్యదర్శి పంగ శరత్ కుమార్,ను ఎన్నుకోవడం జరిగిందని అన్నారు నుతన అధ్యక్షుడు అజయ్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో మా గ్రామంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా ఎన్నుకున్నందున నా కొత్తపల్లి గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ మా "మాదిగ" సంఘంలో ఎలాంటి సమస్యలు వచ్చినా ముందుండి నా ప్రజల కోసం సేవ చేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పెర్కరాజేందర్, పల్లె విజయ్, పేర్క సురేష్, మనోహర్, అభిలాష్, అనిల్, రాజయ్య, జయరాజ్, కిష్టయ్య, మారయ్య రాజేశం, మైసయ్య, అరవింద్ ,రవి, మదనయ్య, పల్లె శ్రీనివాస్ లు. మరియు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.



## కాసు సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగారావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి కాసు సీతమ్మ గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించడం జరిగింది ఏర్పాటు చేసిన దశదినకర్మ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు దోకూరి ప్రభాకర్ రెడ్డి హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసు శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, అంబాజి, నాయకులు ఏంరెడ్డి రంగారెడ్డి, అజీజ్,వెంకటరెడ్డి, తిరుపతయ్య, శెట్టి రాజశేఖర్, శ్రీను,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి మానవత్వం చాటుకున్న యువత..



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని రామకృష్ణాపురంలో స్థానిక సర్పంచ్ తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ రెడ్డి మాతృమూర్తి సీతమ్మ దశదినకర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో భాగంగా యువకులు పెద్ద ఎత్తున పాల్గొని పలువురు యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారికి రక్తం అందించి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. యువత రక్తదానంపై అవగాహన పెంచుకుని, సమాజ సేవలో ముందుండాలని వారు పిలుపునిచ్చారు. సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి,కుటుంబ సభ్యులు, రక్తదానం చేసిన యువకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి విజయ పాలశీతలీకరణ కేంద్రం స్థలం వినియోగించాలి

**ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చుకోవాలి**

**మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహారెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



శ్రీశైలం ప్రధాన రహదారిపై వేగంగా అభివృద్ధి చెందుతున్న కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రి ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రి లేకపోవడంతో అత్యవసర వైద్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించే సౌకర్యం లేకపోవడంతో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. గత పాలకవర్గ హయాంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సహకారంతో ప్రభుత్వాసుపత్రి ఏర్పాటుకు రూ. 1.43 కోట్లు మంజూరైనప్పటికీ, అనువైన ప్రభుత్వ స్థలం అందుబాటులో లేక పనులు ముందుకు సాగలేదని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధీనంలో ఉన్న విజయ పాలశీతలీకరణ కేంద్రం స్థలం సుమారు 2 ఎకరాల 20 గుంటలు, దానికి ఆనుకుని ఉన్న శిఖం భూమి సుమారు 30 గుంటలు కలిపి మొత్తం దాదాపు 3 ఎకరాల 10 గుంటలు ప్రభుత్వాసుపత్రి నిర్మాణానికి అనువుగా ఉంటుందని లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు. ఈ స్థలాన్ని ఆసుపత్రి కోసం కేటాయించి, పాలశీతలీకరణ కేంద్రానికి సమీపంలోని ప్రభుత్వ భూమిలో రెట్టింపు విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులను, అధికారులకు వినతులు ఇచ్చినట్లు తెలిపారు. పాలశీతలీకరణ కేంద్రం నుంచి వెలువడే వ్యర్థాల కారణంగా సమీపంలోని ఉపరాశి కుంట కలుషితమవుతున్నదని, దుర్వాసనతో పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్‌లో జూనియర్ కళాశాల ఏర్పాటు కూడా అవసరమని, అదేవిధంగా ప్రజలకు అనుకూలమైన ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.పాలశీతలీకరణ కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ పాలు వాహనాలలో వచ్చి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు పాలు వాహనాలలో తరలిస్తున్నందున, సమీపంలోని ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలానికి కేంద్రాన్ని తరలించడం వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత భవనం శిథిలావస్థ స్థితిలో ఉన్నందున ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం మరియు నూతన నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఈ అంశంపై గత పాలకవర్గం ప్రభుత్వ పెద్దలు, అధికారులను కలిసి వివరించినట్లు, అసెంబ్లీ ఎన్నికలు రావడం ,పాలక వర్గం గడువు ముగియడంతో పనులు ముందుకు సాగలేదని తెలిపారు.

కడ్తాల్ మండల ప్రజల చిరకాల కోరికగా ఉన్న ప్రభుత్వాసుపత్రి నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ విషయంపై పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు అఖిలపక్షంగా సమావేశమై సమగ్రంగా చర్చించి, అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని లక్ష్మీనరసింహా రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఈ కేవైసీకి మరో రోజే...

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ పూర్తి చేయాల్సింది. అయితే ఈ కేవైసీ పూర్తి చేయడానికి ఇప్పటి వరకు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సిన అవసరం లేకుండా మొబైల్ ఫోన్ నుంచి ఫేస్ అథెంటికేషన్ ద్వారా ఈ-కేవైసీ చేసుకునే సదుపాయాన్ని చమురు కంపెనీలు కల్పిస్తున్నాయి. ఎల్‌పీజీ కనెక్షన్ అసలైన వినియోగదారుడిదేనా? అనే విషయాన్ని ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా నిర్ధారించడం ఈ-కేవైసీ ఉద్దేశం. ముఖ్యంగా ఉజ్వల పథకం వంటి ప్రయోజనాలు పొందుతున్న వినియోగదారులకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రభుత్వం గతంలో స్పష్టం చేసిన ప్రకారం.. ఈ ప్రక్రియను డెలివరీ సిబ్బంది ద్వారా, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ వద్ద లేదా సంబంధిత కంపెనీ మొబైల్ యాప్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు.మొబైల్ ద్వారా ఈ-కేవైసీ చేయాలంటే మీ గ్యాస్ కంపెనీకి సంబంధించిన అధికారిక మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

## మాజీ మంత్రి హరీష్‌రావు ఆశీస్సులు తీసుకున్న ఆలేటి సంతోష్ రెడ్డి



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట** జిల్లా భారత రాష్ట్ర సమితి యూత్ వింగ్ నాయకుడు ఆలేటి సంతోష్ రెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన హరీష్ రావుకు పూలబోకే అందించి, ప్రత్యేక ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆలేటి సంతోష్ రెడ్డి మాట్లాడుతూ తన ప్రియతమ నాయకులు, ఆత్మీయులైన హరీష్ రావు గారు నిండు మనసుతో జన్మదిన శుభాకాంక్షలు తెలపడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ కరుణాకర్ రెడ్డి నూనె కుమార్ చంద్రశేఖర్ రెడ్డి?దేవి రవీందర్? అహ్మద్ రమేష్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## నూతన ఇందిరమ్మ ఇండ్ల తో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాలి..



**ఎంపీడీవో నీ సన్మానించిన కాంగ్రెస్ నాయకుడు వెంకట చెల్మరెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండల ప్రజా పరిషత్ అధికారి గీతారెడ్డి నీ ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వ కంగా కలిసి శాలువాతో సన్మానించిన మార్చాల కాంగ్రెస్ పార్టీ నాయకుడు తలసాని వెంకట చెల్మ రెడ్డి ఈ సందర్భంగా మార్చాల గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల చెల్లింపులు, నూతన పెన్షన్ల మంజూరు తదితర ప్రజా సమస్యలపై ఎంపీడీఓ గీతారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్చాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు నిజాముద్దీన్,రాంరెడ్డి, మాజీ వార్డు సభ్యులు ఆదిరాల వెంకటయ్య, తాండ్ర. వెంకటయ్య, దున్న. భాస్కర్, నాయకులు మేకల పాండు, వికలాంగుల సంఘం అధ్యక్షుడు మార్గాల రవి,ఆవ తిపతయ్య, ప్రేమ కుమార్, శశిధర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు



**యూనిఫామ్, టై, బెల్ట్, పంపిణీ చేసిన సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం జూలపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫామ్, టై, బెల్ట్, షూలను గ్రామ సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ ఉపసర్పంచ్ ఇంద్రకంటి శ్రీశైలం గౌడ్ కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సుమిత్ర రాఘవేంద్ర, అల్లాజీ గౌడ్, జగదీశ్ గౌడ్ గ్రామ కార్యదర్శి విజయ్ భాస్కర్ గ్రామ పెద్దలు మధు, సుధాకర్, మల్లేష్, నరసింహ చారి ఉపాధ్యాయులు శైలజ రూప విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్, టై, బెల్ట్, పంపిణీ చేసిన నాయకులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం వెల్జాల్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వము నుండి వచ్చిన యూనిఫామ్,టై, బెల్ట్, షూ, విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు నసీమా సుల్తానా తో కలిసి అందజేసిన గ్రామ సర్పంచ్ వాన రాశి రాములమ్మ, ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి, ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద కుటుంబలకు చెందిన విద్యార్థిని ,విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన విద్యను అందిస్తూ, నాణ్యమైన దుస్తులు అందించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల బలోపేతం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుంది అని అన్నారు. కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పి కోఆప్షన్ సభ్యులు ముజీబూర్ రహమాన్, మాజీ ఉప సర్పంచ్ అజీజ్ వార్డు సభ్యులు విశేఖర్ నాయకులు వెంకట్ రెడ్డి , ఎస్.విజయ్ కుమార్, ఆరిఫ్, వెంకటేష్, విష్ణువర్ధన్ యాదవ్, వద్దే రాజు, దుబ్బ గణేష్, ఉపాధ్యా యులు, , ఏపీఎం రామస్వామి సీసీ శ్రీశైలం, మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య,బుక్ కిపర్లు, మరియు గ్రామస్తులు, పాల్గొన్నారు



# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండో విడత ఎస్ ఐ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ

**నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలి**
**ఐక్యత పౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి మండలంలో ఈనెల 16 నుండి పాత కృష్ణవేణి జూనియర్ కాలేజ్ (తాహసిల్దార్) కార్యాలయం ఎదురుగా లో రెండో విడత ఎస్ ఐ కానిస్టేబుల్ శిక్షణ తరగతులు ప్రారంభం కావడం జరుగుతుంది కావున కల్వకుర్తి మండలం లోని నిరుద్యోగ ఆసక్తిగల యువతి యువకులు 63 005534 67 గల నెంబర్ ని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సీఓఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మొదటి విడత ఎస్ఐ కానిస్టేబుల్ శిక్షణ తరగతులు విజయవంతంగా ముగించుకొని రెండవ విడత శిక్షణ తరగతులు నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ, పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న అభ్యర్థులకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ ఐ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు అవసరమైన రాత పరీక్ష, జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, మెంటల్ ఎబిలిటీ తదితర అంశాల్లో నిపుణులచే శిక్షణ అందించడంతో పాటు, అభ్యర్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా మార్గదర్శకత్వం కల్పిస్తున్నామని ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఖరీదైన కోచింగ్ తీసుకోలేని ప్రతిభావంతులైన యువతకు ఈ ఉచిత శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది అని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే నిరుద్యోగ యువత కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోలీస్ ఉద్యోగాలు సాధించాలని హైదరాబాద్ ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సూచించారు పట్టుదల, క్రమశిక్షణతో శిక్షణ పొందితే ప్రభుత్వ ఉద్యోగం సాధించడం సాధ్యమేనని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా



సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కోరారు.

## విధుల్లో చేరిన ప్రభుత్వ జనరల్ సర్జన్ డాక్టర్ నికీల్ తేజ

**మంత్రి శ్రీధర్ బాబు చొరవతో మంథని ఆసుపత్రికి మరో సర్జన్**

అగ్నిధార న్యూస్ మంథని :



మంథని ఏరియా ఆసుపత్రిలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ ద్వారా నూతన నియామకాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో శుక్రవారం రోజు జనరల్ సర్జన్ డాక్టర్ నికీల్ తేజ విధుల్లో చేరారు. ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ టీవీ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... మంథని పట్టణ, పరిసర మండలల ప్రజలందరూ తరచుగా వచ్చే శస్త్రచికిత్స వ్యాధులు అపెండిసైటిస్,పిత్తాశయంలో రాళ్లు,పిత్తాశయం వాపు,ఇంగ్వైనల్ హెర్నియా / గజ్జల్లో హెర్నియా,బొడ్డు హెర్నియా,పొట్ట గోడ / ఇన్సిషనల్ హెర్నియా,పైల్స్ / మొలలు,ఫిషర్ / మలద్వారం చీలిక,ఫిస్టులా / భగందరం,మలద్వారం చుట్టూ చీము గడ్డ,పైలోనైడల్ సైనస్ హైడ్రోసీల్, రొమ్ములో గడ్డలు,రొమ్ములో చీము గడ్డ,లైపోమా / కొవ్వు గడ్డ,సెబేషియస్ సిస్ట్ / చర్మం కింద గడ్డ,శరీరంలో చీము గడ్డలు / అబ్సెస్,డయాబెటిక్ ఫుట్ పుండ్లు,పేగుల అడ్డంకి,పేగుకు రంధ్రం పడటం / పెరిటోనైటిస్ సంబంధించిన శాస్త్ర చికిత్సలను (లాప్రోస్కోపిక్ సర్జరీలను),మన మంథని ఏరియా ఆసుపత్రిలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ఏమైన సమస్యలు ఉన్నచో సూపరిండెంట్ నీ నేరుగా ఈ సెల్ నెంబర్ 9885808589 ద్వారా సంప్రదించగలరని తెలిపారు.ం

# ఫూలే దంపతుల ఆశయాలు స్ఫూర్తిదాయకం

**విగ్రహాల ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్**

అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్):

సామాజిక సమానత్వం, విద్య, మహిళా సాధికారత, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల సేవలు చిరస్మరణీయమని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ.. శతాబ్దాలుగా కొనసాగిన సామాజిక అసమానతలు, వివక్షకు వ్యతిరేకంగా పూలే దంపతులు ధైర్యంగా పోరాడారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు విద్యను అందించడంతోపాటు అణగారిన వర్గాలకు విద్య, గౌరవం, ఆత్మగౌరవం కల్పించేందుకు వారు చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మహిళా విద్య కోసం సావిత్రిబాయి పూలే ఎదుర్కొన్న అవరోధాలు, చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శమన్నారు.పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ



కేవలం కార్యక్రమం కాదని, వారి ఆశయాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యతను గుర్తుచేసే సందర్భమని అన్నారు. విద్య, సమానత్వం, మహిళా సాధికారత, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయం, అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధులకు నాట్య నీరాజనం

**దేశభక్తి, జాతీయ సమైక్యత చాటేలా ప్రత్యేక నాట్య ప్రదర్శనలు**

అగ్ని ధార న్యూస్ ,(రామగిరి):

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరిస్తూ 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆర్.కె. కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. వంద ప్రపంచ రికార్డులను సాధించిన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమానికి పెద్దపల్లి జిల్లా ముస్త్యాల మాజీ సర్పంచ్, అంతర్జాతీయ అవార్డు గ్రహీత రామగిరి లావణ్య గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. సమాజ సేవలో భాగంగా సుమారు 2 వేల మంది స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను సేకరించిన ఆమె సేవలను నిర్వాహకులు కొనియాడారు.దేశభక్తి, జాతీయ సమైక్యత, స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతిబింబించేలా నాట్య ప్రదర్శనలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాకారులు, సాంస్కృతిక ప్రముఖులు, సామాజిక సేవకులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు పాల్గొననున్నారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు పోరాడాలి




**స్వాతంత్ర్య స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధం కావాలి**
**సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి**

అగ్నిధార న్యూస్,(రామగుండం):

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో కార్మిక హక్కులను కాపాడుకునేందుకు మరో పోరాటానికి కార్మిక వర్గం సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం గోదావరిఖనిలో సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కార్మిక వర్గం కీలక పాత్ర పోషించి ఎన్నో త్యాగాలు చేసిందన్నారు. కార్మిక హక్కులు, చట్టాల సాధన కోసం వీరోచిత పోరాటాలు చేయడంతోపాటు మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించిందన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని ఆరోపించారు. వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.దేశ సంపద, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, జిల్లా కోశాధికారి రామాచారి, ఉపాధ్యక్షుడు బిక్షపతి, నాయకులు నెర్వట్ల నర్సయ్య, లక్ష్మారెడ్డి, నరహరీరావు, ఎ. మొగిలి, శ్రీహరి, మోహన్, కిషన్, రవి, సాగర్, ఎన్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ?సెయింట్ విన్సెంట్ పాఠశాలలో ఘనంగా 'ఇన్వెస్టిచర్ సెర్మనీ' ప్రమాణ స్వీకార మహోత్సవం

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

జగదేవపూర్ మండలం అలి రాజుపేట గ్రామశివారులో స్థానిక సెయింట్ విన్సెంట్ పాఠశాలలో విద్యార్థుల హౌస్ గ్రూప్ లీడర్ల బాధ్యతల అప్పగింత కార్యక్రమం ఇన్వెస్టిచర్ సెర్మనీ ఏటా నిర్వహించే ఆనవాయితీలో భాగంగా శుక్రవారం ప్రిన్సిపాల్ రేవరెండ్ సిస్టర్ జానెట్ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అలి రాజుపేట గ్రామ సర్పంచ్ రాచమల్ల ఎల్లేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ ? రాచమల్ల ఎల్లేష్ ప్రిన్సిపాల్ రేవరెండ్ సిస్టర్ జానెట్ మాట్లాడుతూ ?"విద్యార్థులలో చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయి. కేవలం చదువే కాకుండా, పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి పాఠశాల యాజమాన్యం ఇటువంటి వేడుకలను నిర్వహించడం ఎంతో అభినందనీయం."

**ప్రిన్సిపాల్ రేవరెండ్ సిస్టర్ జానెట్ :**పాఠశాల ప్రిన్సిపాల్ రేవరెండ్ సిస్టర్ జానెట్ మాట్లాడుతూ, విద్యార్థులను భావి భారత నవ నిర్మాతలుగా తీర్చిదిద్దడంలో ఇటువంటి నాయకత్వ బాధ్యతల అప్పగింత కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.?ఈ వేడుకలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## కుల వ్యవస్థ నిర్మూలనకు సమగ్ర కార్యాచరణ అవసరం

**ప్రతి ఒక్కరికీ రూ.5 కోట్ల ఆర్థిక లబ్ధితో కుల నిర్మూలనకు ప్రత్యామ్నాయం: జేవీ రాజు**

అగ్ని ధార న్యూస్,( రామగుండం):

కుల వ్యవస్థ నిర్మూలనకు సమాజంలో అనేక స్థాయిల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని న్యూ ఇండియా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జేవీ రాజు అన్నారు. ఉమామహేశ్వరరావు కుల వ్యవస్థపై 32 అంశాలతో ఇచ్చిన వివరణకు ధన్యవాదాలు తెలిపారు.కుల వ్యవస్థ నిర్మూలనకు కొత్త చట్టాలు చేయాల్సిన అవసరం లేదని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా సమాజంలో మార్పులు తీసుకురావాలని జేవీ రాజు అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరికీ రూ.5 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూర్చడం ద్వారా కుల ఆధారిత అసమానతలకు ప్రత్యామ్నాయం చూపవచ్చని పేర్కొన్నారు.

రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలను లోతుగా పరిశీలించి, కుల వివక్షకు తావులేని సమాజ నిర్మాణానికి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కులం రాజ్యాంగపరంగా పూర్తిగా రద్దయిందని కాకుండా, కుల ఆధారిత వివక్ష, అంటరానితనం రాజ్యాంగం నిషేధించిన అంశాలని ఆయన వ్యాఖ్యలను ఉటంకిస్తూ పేర్కొన్నారు. కుల నిర్మూలన కోసం ముందుకు వెళ్లే విధానంపై రోడ్‌మ్యాప్ రూపొందించేందుకు ఉమామహేశ్వరరావు సలహాలు, సూచనలు అందించాలని జేవీ రాజు కోరారు. సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో సమానత్వం, సామాజిక న్యాయం సాధించే దిశగా కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

## రేషన్ కార్డులపై రాజకీయ నేతల ఫోటోలు ప్రజా ధనం వృధా చేయడమే - ఎన్ సి సంతోష్

అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా

గజ్వేల్ పట్టణం తెలంగాణ ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేయ తలపెట్టిన రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలను ముద్రించడాన్ని బిఆర్ఎస్ పార్టీ సిద్దిపేట జిల్లా గజ్వేల్ సీనియర్ నాయకులు ఎన్.సి. సంతోష్ తీవ్రంగా తప్పుపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గుర్తింపు కార్డులపై అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల ఫోటోలు ముద్రించడం వల్ల భవిష్యత్తులో ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన నిబంధనల కింద ఆ కార్డులు చెల్లకుండా పోయే లేదా మార్చాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. కేవలం రాజకీయ ప్రచారం కోసమే ప్రజా ధనాన్ని ఇలా దుర్వినియోగం చేయడం సరికాదని, ప్రతిసారి కొత్త కార్డులు అచ్చు వేయడం వల్ల ఖజానాపై అనవసర భారం పడుతుందని మండిపడ్డారు. గతంలో సుప్రీమ్ కోర్ట్ కామన్ కాస్ పిల్ విషయంలో మరియు జార్ఖండ్ రాష్ట్రంలో అక్కడి కోర్టులు దీనికి వ్యతిరేకంగా తీర్పునిచ్చాయని గుర్తు చేసారు. ప్రజా ధనాన్ని ఇటువంటి వ్యర్థమైన ప్రచారాలకు తగలేయకుండా, సామాన్య ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజా ధనాన్ని వృధా చేసే విధానాలకు స్వస్తి పలికి, ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని అన్నారు.

## ప్రత్యమ్నాయ పంటలు పండించాలి జిల్లా వ్యవసాయ అధికారి



**రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావాలు మరియు ఎఫ్ ఎఫ్ ఎస్ యాప్ పై అవగాహన కల్పించారు**

అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:

మండలంలోని ముకర్లాబాద్ మరియు నశీచర్ల గ్రామాలలో వరి, పెసర, కంది పొలాలను ఈరోజు శనివారం నాడు జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, సహాయ వ్యవసాయ సంచాలకులు రాంపాల్, మండల వ్యవసాయ అధికారి నరేందర్ సంయుక్తంగా సందర్శించారు.

ఈ సందర్శన సందర్భంగా పొలాల్లోని పంటల పెరుగుదలను పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఎల్ నినో వాతావరణ పరిస్థితుల ప్రభావాలు మరియు వాటి వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ప్రత్యామ్నాయ పంటల ప్రాముఖ్యత గురించి వివరిస్తూ, వర్షాభావ పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా ఉండేందుకు తగిన ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతులకు ఎరువులు పారదర్శకంగా, సులభంగా అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్ ఎఫ్ ఎస్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ సెల్ గురించి అవగాహన కల్పించారు. యాప్ ద్వారా ఎరువుల బుకింగ్, క్యూ ఆర్ కోడ్ పొందడం, బిల్లు పొందడం వంటి విధానాలను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నిఖిత, మైబయ్య, శ్రీకాంత్ రెడ్డి, బాల కిస్టయ్య, హనుమంతు, రామకృష్ణ, రాఘవేందర్, శ్రీను పాండయ్య ,మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## హమాలీల సమస్యలు పరిష్కరించాలి



**తాండూర్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా**

అగ్నిధార న్యూస్ ,(తాండూర్):

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు హమాలీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం తాండూర్‌లో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా హమాలీల సంఘం సీఐటీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గుమాస ప్రకాష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ హమాలీల కోసం ప్రత్యేకంగా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, నెలకు రూ.6 వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన హమాలీ కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు.హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని అన్నారు. రైస్‌మిల్లులు, బజార్లు, గోడౌన్లు, ఐకేపీ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న హమాలీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.హమాలీల హక్కుల సాధన కోసం జిల్లాలోని అన్ని విభాగాల హమాలీలు ఐక్యంగా ఉద్యమాల్లో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఇందూరి మల్లేష్, చింతపురి లక్ష్మణ్, ధర్మరాజుల వెంకటేష్, చదువుల రవీందర్, తోగారి శ్రీను, తాండూర్ మల్లేష్, మాసాడి సుధాకర్, కొండు రాములు, ఆయిళ్ల శంకర్, పుట్ట రమణ, రుకుంబాపు, మాసాడి తిరుపతి, లెక్కల జగదీష్, ధరణి బుచ్చయ్య, ఒడ్నాల చందు, ఇందూరి బానేష్, కామెరా బాపుతో పాటు పలువురు హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

## యోగి బాటలో సువేందు

**కోల్ కత్తా :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ధోరణులను సవాలు చేస్తూ సువేందు అధికారి తన పాలనను ఆరంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు అనుసరించిన కఠినమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఆయన అనుసరిస్తున్నారని విశ్లేషకులు గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనే పాత సమస్యలపై దృష్టి సారించడం ఈ విధానం ప్రధాన లక్షణం.యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో మాఫియా నెట్‌వర్క్‌లను అణచివేయడం, మహిళలపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు, అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ చర్యలు, అల్లర్ల సమయంలో రాష్ట్రాన్ని శాంతియుతంగా ఉంచడం వంటి అంశాలు గుర్తుంచుకోదగినవి. సువేందు అధికారి కూడా ఇలాంటి సమస్యలపై దృష్టి సారించారు. ఏడు దశాబ్దాలుగా పరిష్కారం కాని అంశాలను త్వరగా అందుకోవడం ఆయన పాలనలో కనిపిస్తోంది. కోల్‌కతా విమానాశ్రయం సమీపంలోని నిర్మాణం విమానాల కదలికకు అడ్డంకిగా మారిన సందర్భంలో కఠిన నిర్ణయం తీసుకోవడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి చర్యలు రాష్ట్రంలో చట్ట పాలనను బలోపేతం చేస్తాయని మద్దతుదారులు వాదిస్తున్నారు.ప్రజా ప్రదేశాల్లో మసీదులు, ఆలయాలు, చర్చిల నుంచి వచ్చే అధిక శబ్దం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు.

# గ్యాస్ వినియోగదారులను దోచుకుంటున్న 'శేషమా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ'

**గ్యాస్ పైప్ కొంటేనే ఈ-కేవైసీ చేస్తామంటూ బెదిరింపులు!**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట (జహంగీర్ అగ్నిధార ప్రతినిధి)**

జిల్లా గజ్వేల్ పట్టణం ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులకు ఈ-కేవైసీ పూర్తి చేయడానికి ఆగస్టు 16, 2026 ను చివరి గడువుగా నిర్ణయించింది. నిర్ణీత గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేయకపోతే లబ్ధిదారులకు అందే గ్యాస్ సబ్సిడీ నిలిచిపోయే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం వినియోగదారులు డిజిలాకర్, హెచ్‌పీ లేదా ఇండేన్ అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారా గానీ, లేదా నేరుగా సంబంధిత గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి ఉచితంగా బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. అయితే, సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని 'శేషమా ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్' యాజమాన్యం మరియు సిబ్బంది నిబంధనలను తలకిందులు చేస్తూ వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ-కేవైసీ కోసం ఏజెన్సీకి వచ్చే వినియోగదారులతో సిబ్బంది బాధ్యతారాహిత్యంగా, ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఖచ్చితంగా రూ. 200 చెల్లించి గ్యాస్ పైప్ కొనుగోలు చేస్తేనే ఈ-కేవైసీ చేస్తామని, లేకపోతే చేయమని తెగేసి చెబుతున్నారు. గజ్వేల్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి స్మార్ట్‌ఫోన్ వాడకం తెలియని నిరక్షరాస్యులు, వృద్ధులు, మహిళలు ఈ-కేవైసీ కోసం



ఉదయం నుంచి గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ముందు గంటల తరబడి వేచి చూస్తున్నారు. సబ్సిడీ ఎక్కడ ఆగిపోతుందోనన్న భయంతో, ఏజెన్సీ సిబ్బంది వేధింపులు తట్టుకోలేక పేద వినియోగదారులు చేసేది లేక వారు అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఉచితంగా కల్పించాల్సిన సేవలను ఆసరాగా చేసుకుని, సబ్సిడీ నిలిచిపోతుందనే భయాన్ని పెట్టుబడిగా మార్చుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న శేషమా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీపై పౌరసరఫరాల శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి. గడువు దగ్గర పడుతున్నందున గజ్వేల్ మండల ప్రజలకు ఎలాంటి షరతులు లేకుండా, ఉచితంగా ఈ-కేవైసీ పూర్తయ్యేలా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి న్యాయం చేయాలని స్థానిక ప్రజలు, వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇవాళ్టి నుంచి స్మార్ట్ సెక్యూరిటీ కార్డు

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమైంది. రాష్ట్రంలో ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, నకిలీ కార్డుల బెడదను శాశ్వతంగా తొలగించేందుకు ప్రభుత్వం 'స్మార్ట్ సెక్యూరిటీ కార్డు'ను తీసుకొచ్చింది. ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశం ఏంటంటే, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత రేషన్ బియ్యం క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన నిరుపేద కుటుంబాలకు మాత్రమే అందాలి. గతంలో ఉన్న పేపర్ ఆధారిత లేదా సాధారణ ప్లాస్టిక్ కార్డుల స్థానంలో ఇప్పుడు అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ స్మార్ట్ కార్డులు పంపిణీకానున్నాయి. ఆగస్టు 15న దేశవ్యాప్తంగా జరుపుకునే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈ వినూత్న కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే అధికారిక పతాకవిష్కరణ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్డులను లబ్ధిదారులకు స్వయంగా అందజేసి పథకాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొననున్నారు. తొలి విడతలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు కార్డులు ఇచ్చి, తదుపరి దశలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కొత్త రేషన్ కార్డు కేవలం ఒక గుర్తింపు పత్రం మాత్రమే కాదు, ఇది చూడటానికి ఆధునిక డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు ఏటీఎం కార్డు మాదిరిగానే ఉంటుంది. కార్డుపై ఎడమవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కుడివైపు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలు ముద్రించారు. కార్డుపై రేషన్ కార్డు నెంబర్, కుటుంబ యజమాని పేరు, చౌకధరల దుకాణం సంఖ్య, గ్రామం, మండలం, జిల్లా, ఇంటి చిరునామా వివరాలు స్పష్టంగా ఉంటాయి. కార్డుల్లో కుటుంబ యజమానిగా మహిళల పేర్లనే ముద్రించడం ఒక కీలక అంశం.

సాధారణ వ్యక్తులు ఈ కార్డును జిరాక్స్ చేయడం లేదా క్లోనింగ్ చేయడం అసాధ్యం అయ్యేలా, బ్యాంకు నోట్లు, పాస్‌పోర్టుల్లో వాడే అత్యంత శక్తివంతమైన సెక్యూరిటీ టెక్నాలజీని ఇందులో పొందుపరిచారు. కార్డుపై ఉన్న గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ అనే అక్షరాలు సాధారణ ప్రింటింగ్‌లా కాకుండా కొంచెం ఉబ్బెత్తుగా ఉంటాయి. కార్డును చేతితో తడిమినప్పుడు ఈ స్పర్శ స్పష్టంగా తెలుస్తుంది. ఇది దృష్టి లోపం ఉన్నవారు కూడా కార్డు అసలైనదో కాదు గుర్తించడానికి ఉపయోగపడుతుంది.




కార్డుపై అత్యంత సూక్ష్మ పరిమాణంలో అక్షరాలను ముద్రించారు. వీటిని కేవలం భూతద్దం లేదా మైక్రోస్కోప్ ద్వారా మాత్రమే చూడగలం. ఈ అక్షరాలను డిజిటల్ స్కానర్లు కాపీ చేయలేవు. ఒక వేళ ఎవరైనా జిరాక్స్ తీయడానికి ప్రయత్నిస్తే, ఆ భాగం మసకగా లేదా కేవలం ఒక గీతలా మారిపోతుంది.

ప్రతి కార్డు వెనుక భాగంలో ఒక ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఇందులో లబ్ధిదారుడి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, సీరియస్ నంబర్, డిజిటల్ ఐడీ భద్రంగా ఉంటాయి. ఈ సమాచారాన్ని కేవలం పౌరసరఫరాల శాఖ సాఫ్ట్‌వేర్ మాత్రమే చదవగలదు. దీని వల్ల డేటా భద్రతకు ఎటువంటి ఢోకా ఉండదు.

కార్డుపై సాధారణ కంటికి కనిపించని ఒక రహస్య గుర్తు ఉంటుంది. దీనిని అతినీలిలోహిత కాంతి కింద ఉంచినప్పుడు మాత్రమే ప్రభుత్వం చిహ్నం వెలుగులతో కనిపిస్తుంది. తనిఖీ అధికారులు కార్డును వేగంగా వెరిఫై చేయడానికి ఇది సహాయపడుతుంది.

కార్డును కాంతికి లేదా వెలుతురుకు ఎదురుగా ఉంచి చూసినప్పుడు కార్డు లోపలి పొరల్లో ముద్రించిన తెలంగాణ ప్రభుత్వ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది.

తెలంగాణ ప్రభుత్వ అధికారిక ముద్రితతో కూడిన త్రీడీ హోలోగ్రామ్ కార్డుపై అతికించి ఉంటుంది. దీనిని తీసి వేరొక కార్డుకు మార్చడానికి లేదు.

నిర్దిష్ట కోణంలో చూసినప్పుడు మాత్రమే ఒరిజినల్ లేదా గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ అనే పదాలు కనిపించేలా రెండు చిత్రాలను పొందుపరిచారు.

కార్డు జారీ చేసే అధికారి అయిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిజిటల్ సంతకాన్ని కార్డుపై అధికారిక ముద్రగా పొందుపరిచారు.

కార్డు అంచుల్లో, లోపలి భాగంలో సంక్లిష్టమైన పేట్రన్ ఉపయోగించారు. ఇవి కార్డు ప్రామాణికత పెంచుతాయి.

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ స్మార్ట్ కార్డులు రాష్ట్ర సంక్షేమ రంగంలో ఒక కీలక మైలురాయిగా నిలవనున్నాయి. అయితే లబ్ధిదారుల తమ కార్డులపై ఉన్న క్యూఆర్ కోడ్ లేదా హోలోగ్రామ్ దెబ్బతినకుండా జాగ్రత్త వహించాలి. కార్డు పోయినా లేదా ఇతర మార్పుల కోసం నేరుగా మీ సేవ లేదా తహసీల్దార్ కార్యాలయాన్ని మాత్రమే సంప్రదించాలి

# డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో భారీ పెట్టుబడుల సదస్సు

**హైదరాబాద్ :** అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ రెడీ అవుతోంది. డిసెంబర్‌లో 3 రోజుల పాటు భారీ పెట్టుబడుల సదస్సును నిర్వహించేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో జరిగే ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ ప్రణాళికతో పాటు డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా, ఐటీ, గ్రీన్ ఎనర్జీ, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో పెట్టుబడి అవకాశాలను ప్రదర్శించనున్నారు. తెలంగాణలో పెట్టుబడుల ఆకర్షణకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తాజాగా సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ' తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0' నిర్వహణకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. డిసెంబర్ 7, 8, 9వ తేదీల్లో మూడు రోజుల పాటు ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహించాలని నిర్ణయించింది. గతేడాది నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కంటే ఈసారి మరింత విస్తృత స్థాయిలో సదస్సును నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేయనుంది. ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ ప్రధాన థీమ్‌గా.. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0ను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను దేశ, విదేశీ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు వివరించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. సదస్సు ఏర్పాట్ల కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. విదేశీ ప్రతినిధులు, పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రణాళికను కూడా గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచానికి పరిచయం చేయాలని రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. హైదరాబాద్ నగరాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసే ప్రణాళికలు, మౌలిక వసతుల అవకాశాలను పెట్టుబడిదారుల ముందుంచేలా ప్రత్యేక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు. తెలంగాణలో డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా, ఐటీ, గ్రీన్ ఎనర్జీ, తయారీ వంటి కీలక రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను ఈ సదస్సు ద్వారా ప్రపంచ దేశాలకు ప్రదర్శించనున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, స్టార్టప్‌ల విజయాలను కూడా అంతర్జాతీయ వేదికపై ప్రదర్శించాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. కొత్త టెక్నాలజీ ఆవిష్కరణలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వివిధ రంగాల్లో తెలంగాణకు చెందిన సంస్థలు, స్టార్టప్‌లు సాధించిన విజయాలతో పాటు వినూత్న ఉత్పత్తులు, ఆవిష్కరణలను ప్రదర్శించే ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను కూడా ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0లో ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రానికి మరిన్ని భారీ పెట్టుబడులను తీసుకురావడం, పరిశ్రమల విస్తరణకు అనుకూల వాతావరణాన్ని ప్రపంచానికి తెలియజేయడం ఈ సమ్మిట్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అవకాశాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ద్వారా కొత్త పెట్టుబడి ప్రతిపాదనలకు మార్గం సుగమం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

## గ్రేటర్ పోరులో పార్టీలు...

**హైదరాబాద్ :** తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టాయి. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావాలని నిర్ణయించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇదే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. వాస్తవానికి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నాయన్న వాదన ఉంది. బీజేపీకి మాత్రమే హైదరాబాద్ సహా.. కొన్ని జిల్లాల్లో బలం ఉన్నా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడే ఉంది బీజేపీ సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా పార్టీ పెద్దలు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణను దక్కించుకునేందుకు రెడీగా ఉన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో వారి అంచనాలకు అనుగుణంగా కార్యకర్తలు బలోపేతం కావడం లేదు. పార్టీ నాయకుల మధ్య కూడా సఖ్యత కనిపించడం లేదు. ఈ పరిణామాలను సరిదిద్దుకునేందుకు బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ చీఫ్ రామచందర్‌రావు.. చర్యలు చేపట్టారు. ఇక, సంస్థాగతంగా బాగానే ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు కూడా.. ఈదిశగానే అడుగులు వేయడం ఏంట నేది చర్చకు దారితీస్తోంది. దీనికి ప్రధానంగా ఒకపార్టీపై మరో పార్టీ చేసుకుంటున్న విమర్శలు.. వేసుకుం టున్న నిందలే కారణమని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను కూడా నీరు గారుస్తోందని, రైతులు ఉసూరుమంటున్నారని.. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దీని నుంచి తమను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం.. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ కేంద్రంగా సాగుతున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇక, ఉమ్మడి సమస్యల విషయానికి వస్తే.. క్షేత్రస్థాయిలో చిన్నా చితకా పార్టీల ఆవిర్భావం.. వాటి వల్ల తమ ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే పరిస్థితిని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు.. క్షేత్రస్థాయి కార్యకర్తలను కాపాడుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాయి

## శ్రీ వారిని దర్శించుకున్న మానసా వారణాసి

**తిరుపతి :** టాలీవుడ్ హీరోయిన్ మానసా వారణాసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆమె ప్రదక్షిణలు చేస్తుండగా కొందరు భక్తులు ఆమెతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. దీంతో కాస్త ఇబ్బందికి గురైన ఆమె పరుగులు పెట్టారు. అయినా, కొందరు భక్తులు వదలకుండా సెల్ఫీల కోసం హీరోయిన్‌ను వెంబడించారు. చివరకు పరుగు పరుగున కారు వద్దకు చేరుకున్నా కూడా వదలలేదు. ఇబ్బందిగా ఫీల్ అయినా అడిగిన వారందరికీ సెల్ఫీలు ఇచ్చారు మానసా వారణాసి. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొందరు ఫ్యాన్స్ తీరుపై నెటిజన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి ప్రశాంతత కోసం వస్తారని... సెలబ్రిటీలను సెల్ఫీల కోసం ఇలా ఇబ్బంది పెట్టడం కరెక్ట్ కాదంటూ కామెంట్స్ చేస్తున్నారు. కొందరు వ్యక్తిగత భద్రత నియమించుకుంటే బెటర్ అని అంటున్నారు. తెలంగాణకు చెందిన హీరోయిన్ మానసా వారణాసి మోడల్‌గా కెరీర్ ప్రారంభించారు. 2020లో ఫెమినా మిస్ ఇండియా అందాల కిరీటాన్ని అందుకున్నారు. ఆ ఫేమ్‌తో సినిమాల వైపు అడుగులు వేశారు. 2024లో 'దేవకీ నందన వాసుదేవ' మూవీతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. ఈ ఏడాది కపుల్ ఫ్రెండ్లీ మూవీతో మంచి హిట్ అందుకున్నారు. ప్రస్తుతం వరుసగా మూవీస్ చేసేందుకు రెడీ అవుతున్నారు.

## బతికుండగానే భర్త డెత్ సర్టిఫికెట్ తీసుకున్న భార్య

**విజయవాడ :** వితంతు పింఛన్ కోసం ఓ భార్య బతికున్న తన భర్త పేరు మీదే డెత్ సర్టిఫికెట్ తీసుకుంది. అయితే, ఈ విషయం బతికున్న భర్తకు తెలియడం.. అధికారుల వరకూ ఈ విషయం వెల్లడంతో ఖంగుతిన్నారు. అసలు భర్త ఎలా చనిపోయాడో చెప్పాలంటూ ఓ ఆరు ప్రశ్నలతో కూడిన నోటీసులను భార్యకి అధికారులు అందజేశారు. దాంతో చేసిన తప్పును ఆమె ఒప్పుకోక తప్పలేదు. అయితే, దీన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు ఆమెపై కేసు నమోదు చేయాలంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ ఘటన కృష్ణా జిల్లా పెనమలూరులో తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. సమాజం రోజురోజుకూ దారుణంగా మారిపోతుంది. మనకు కావాల్సిన దాని కోసం జనాలు ఎంతకైనా తెగిస్తున్నారు. ఇక్కడో భార్య వితంతు పింఛన్ కోసం భర్త బతికుండగానే డెత్ సర్టిఫికెట్ తీసుకుంది. భార్యే వచ్చి తన భర్త చనిపోయాడు అనడంతో అధికారులు కూడా మరణ ధ్రువీకరణ పత్రం అందించారు. అయితే, చివరకు ఆ భర్త వచ్చి నేనెక్కడ చనిపోయానంటూ అధికారులను అడగడం.. క్రాస్ వెరిఫికేషన్ చేయడంతో ఆ భార్య చేసిన పని బయటపడింది. కృష్ణా జిల్లా పెనమలూరులోని కానూరు శివాలయం రోడ్డులో నివసించే యర్రంశెట్టి రమాదేవి, మురళీకృష్ణ భార్యభర్తలు. రమాదేవి తన భర్త మురళీకృష్ణ మరణించాడు అంటూ తాడిగడప పురపాలికలో మరణ ధ్రువీకరణ పత్రం కోసం అర్జీ పెట్టుకున్నారు. అక్కడి అధికారులు కూడా భార్యే వచ్చి అర్జీ చేసుకోవడంతో సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. అయితే ఈ వ్యవహారం భర్త మురళీకృష్ణకు ఇటీవలే తెలియడంతో అతను అధికారులకు విషయం చెప్పాడు. దాంతో తాడిగడప పరపాలక సంఘం అధికారులు మురళీకృష్ణ ఏ పరిస్థితుల్లో మరణించారో తెలపాలంటూ ఆరు ప్రశ్నలతో కూడిన నోటీసులను రమాదేవికి అందజేశారు. అయితే, భర్త బతికుండటం.. అక్రమంగా డెత్ సర్టిఫికెట్ తీసుకోవడంతో ఏం చేయాలో తెలియన రమాదేవి తప్పును ఒప్పుకొందని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్ నజీర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యంతో కలిసి ఎస్ఐ ఉషారాణికి ఫిర్యాదు చేశారు. రమాదేవిపై కేసు నమోదు చేయాలంటూ కమిషన్ కోరారు. తాను తప్పు చేసినట్లు రమాదేవే నేరుగా ఒప్పుకోవడంతో ఆమెను అరెస్టు చేయాలని కోరారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేస్తామని ఎస్సై ఉషారాణి తెలిపారు.


## తెలంగాణలో ఆటోలు, క్యాబ్‌లు బంద్

**హైదరాబాద్ :** తెలంగాణలో ఆటో, క్యాబ్, స్కూల్ వ్యా?న్ డ్రైవర్లు బంద్‌కు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 23 అర్ధరాత్రి (24) నుంచి బంద్ చేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో సమావేశం నిర్వహించారు. మొత్తం 17 కార్మిక సంఘాల నేతలు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.. ఈ నెల 23 నుంచి బంద్‌కు పిలుపునిచ్చారు. తమకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ముఖ్యమంత్రి నివాసంతోపాటుగా అసెంబ్లీ, ప్రజాభవన్ ముట్టడిస్తామన్నారు కార్మిక సంఘాల నేతలు. హైదరాబాద్‌ను లక్షల ఆటోలతో దిగ్బంధం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరకుల ధరలు పెరిగాయని.. అందుకు తగిన విధంగా ఆటో మీటరు ఛార్జీలనూ పెంచాలంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఓలా, ఉబర్, ర్యాపిడోలకు బదులుగా కొత్త యాప్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేలు పథకం అమలు అంశాన్ని పరిశీలించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం పెద్దల్ని ఆటో డ్రైవర్ల సమస్యలపై ఇప్పటికే పలుమార్లు కలిసి విజ్ఞప్తులు చేశామని కార్మిక సంఘాల నేతలు గుర్తు చేశారు. గతంలో తాము ఒకరోజు సమ్మెకు దిగితే తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీలిచ్చినా ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ నెల 23 నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు బంద్‌కు పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఆర్టీసీ, కార్పొరేట్ సంస్థలకు ఈవీ ఆటోలు అందించే ప్రతిపాదనను వెంటనే నిలిపివేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 7.5 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో సుమారు 2.5 లక్షల మంది ఉన్నారన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమం కొనసాగుతుందున్నారు. మరి తెలంగాణ ప్రభుత్వం ఈ బంద్ అంశంపై ఎలా స్పందిస్తుందో చూడాలి

## హైదరాబాదీ వైబ్ కనిపిస్తుంది!




ఎంసీ హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అమీర్ లోగ్'. రమణారెడ్డి సోమ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి మాధవి రెడ్డి సోమ నిర్మాత. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సంస్థ ఈ చిత్రాన్ని ఈ నెల 21న విడుదల చేస్తున్నది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. దర్శకుడు రమణారెడ్డి చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'హైదరాబాదీ వైబ్ ఉన్న సినిమా ఇది. ఇక్కడ ప్రజల జీవితానికి ప్రతీకలా ఉంటుంది. ఈ కథలో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. హైదరాబాదీ నేటివిటీ అందరిని మెప్పిస్తుంది' అన్నారు. బస్తీలో పుట్టి పెరిగిన తాను..ఓ బస్తీ కథతో తయారైన సినిమాలో నటించడం ఆనందంగా ఉందని హీరో ఎంసీ హరి పేర్కొన్నారు. వేద జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్‌సాయి, దర్శకత్వం: రమణా రెడ్డి సోమ.



## కర్నల్ వెంకట్‌రెడ్డి కామెడీ

అగ్ర కథానాయకుడు వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కాంబినేషన్‌లో అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి ఓ భారీ వినోదాత్మక మల్టీస్టారర్‌ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. వెంకీ సరసన కీర్తి సురేశ్, కల్యాణ్‌రామ్‌కి జోడీగా కృతి శెట్టి నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్నారు. 40ఏండ్ల సినీ ప్రస్థానాన్ని వెంకటేశ్ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఇండియన్ ఆర్మీ యూనిఫామ్‌లో, సన్ గ్లాసెస్, స్కార్ఫ్ ధరించి పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్న వెంకటేశ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఓ స్పోర్ట్ యుటిలిటి వెహికల్ పక్కన నిల్చుని సీరియస్‌గా చూస్తున్న ఆయన లుక్‌ని బట్టి ఇందులో రగ్గడ్ మిలటరీ ఆఫీసర్‌గా వెంకటేశ్ కనిపించబోతున్నారనే విషయం అర్థమవుతున్నది. కౌంటర్ టెర్రరిజం, హోస్టేజ్ నెగోషియేషన్‌లో నిపుణుడైన 'కర్నల్ వెంకట్‌రెడ్డి'గా ఈ పోస్టర్ ద్వారా వెంకటేశ్‌ని పరిచయం చేశారు. వెంకీ, కల్యాణ్‌రామ్ మధ్య ఉండే కెమిస్ట్రీ, కామెడీ సినిమాకు మరింత బలాన్ని చేకూర్చనున్నాయని, హ్యూమర్, ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామాతో సాగే అనిల్ రావిపూడి మార్క్ ఎంటర్‌టైనర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సమర్పణ: సురేశ్ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, శ్రీమతి అర్చన.



## పోతురాజు ఆహార్యంలో మేఘాంశ్

రియల్‌స్టార్ శ్రీహరి తనయుడు మేఘాంశ్ శ్రీహరి హీరోగా ఓ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ తెరకెక్కుతున్నది. లెల్లా రోహిత్ దర్శకుడు. లెల్లా రాహుల్ నిర్మాత. ఆగస్ట్ 15న శ్రీహరి జయంతిని పురస్కరించుకొని తెలంగాణ సంస్కృతిలో భాగమైన పోతురాజు ఆహార్యంలో ఉన్న మేఘాంశ్ శ్రీహరి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పోతురాజు గెటప్‌లో మేఘాంశ్ కనిపిస్తుండగా, అతని నేపథ్యంలో శ్రీహరి కూడా కనిపిస్తుండటం ఈ ఫస్ట్‌లుక్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే 50శాతం ఈ సినిమా షూటింగ్‌ని పూర్తి చేసుకున్నదని, త్వరలోనే టైటిల్ గ్లింప్స్‌ని కూడా విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించారు. ఈ గ్లింప్స్ ద్వారా ఈ సినిమాలోని హీరో ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నట్టు వారు తెలిపారు.



## తెలంగాణ ప్రేమకథ శనార్తి



'రాజు వెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్‌రాజ్, తెలంగాణ జానపద గీతాల ద్వారా పేరు తెచ్చుకున్న నాగదుర్గ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'శనార్తి' శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. సంపత్‌నంది టీమ్ వర్క్స్, శ్రీధనలక్ష్మి ప్రొడక్షన్స్ పతాకాలపై కేవీ శ్రీధర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజ్‌గణేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ సందర్భంగా ఆవిష్కరించిన టైటిల్ పోస్టర్ 'ఏ టేల్ ఆఫ్ కల్చర్' అనే ట్యాగ్‌లైన్‌తో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వేడుకల్ని ప్రతిబింబించేలా ఉంది. అగ్ర దర్శకుడు, చిత్ర నిర్మాతల్లో ఒకరైన సంపత్‌నంది చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తెలంగాణ పల్లెల్లో ప్రజలు ఆత్మీయంగా పలకరించుకునే సందర్భంలో ఉపయోగించే పదం 'శనార్తి'. ఈ ప్రేమకథకు ఈ పదం అచ్చంగా సరిపోతుంది. అఖిల్‌రాజ్-నాగదుర్గ జోడీ ఈ కథకు బాగా కుదిరారు' అన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, సమర్పణ: ఆదిత్య మూవీస్, దర్శకత్వం: రాజ్‌గణేష్ ఉప్పునూత

## కీర్తి నిజంగా వేరే లెవల్

కీర్తిసురేశ్ తెరపైనే కాదు. రియల్ లైఫ్‌లోనూ షార్ప్‌గా ఉంటారు. తనపై వచ్చే విమర్శలను తిప్పికొట్టడంలో ఆమె శైలి ప్రత్యేకంగా ఉంటుంది. తాజాగా ఆమె నాని హీరోగా నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాలో భాగమైంది. ఆ సినిమాలోని ఓ ప్రత్యేక గీతంలో కీర్తి సురేశ్ నర్తించింది. ఈ విషయంపై ఓ యువతి.. అవకాశాలు లేక ఐటమ్ సాంగ్ చేసిందంటూ కీర్తి సురేశ్‌ని విమర్శిస్తూ తన ఇన్‌స్టాలో ఓ వీడియోని షేర్ చేసింది. పైగా 'ది ప్యారడైజ్' సినిమాను కన్నడ సినిమాగా ఆమె ఆ వీడియోలో పేర్కొన్నది. ఈ విమర్శపై కీర్తి సురేశ్ కూల్‌గా తనదైన శైలిలో సమాధానమిచ్చింది. 'ది ప్యారడైజ్'ని కన్నడ సినిమా అనడంపై 'వేరే లెవల్..' అంటూ కీర్తి సైటైర్ విసిరింది. 'చిన్న కరెక్షన్.. నాని నటిస్తున్న తెలుగు సిని మా.. కన్నడ సినిమా కాదు' అంటూ కౌంటరిచ్చింది. అంతే.. సరిగ్గా చెప్పావ్ అన్నట్టుగా పలువురు నెటిజన్లు కీర్తి సురేశ్‌ని అభినందిస్తూ కామెంట్లు పెడుతున్నారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com